ప్రజాశక్తి
శుక్రవారం 16 ఆగస్టు 2024
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

జిల్లా అభ్యున్నతికి కృషి

అనకాపల్లిలో జాతీయ పతాకానికి సెల్యూట్ చేస్తున్న మంత్రి అనిత

- స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మంత్రులు అనిత, సత్యప్రసాద్
- విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ఘనంగా సంబరాలు
- వాడవాడలా ఎగిరిన జాతీయ జెండా

విశాఖలో మాట్లాడుతున్న మంత్రి సత్యప్రసాద్

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో గురువారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా సాగాయి. వాడవాడలా జాతీయ జెండా ఎగిరింది. స్వాతంత్ర్య దినోత్సవ విశిష్టతను, నాటి పోరాటాలను, మహనీయుల త్యాగాలను వక్తలు వివరించారు. విశాఖపట్నంలో జరిగిన వేడుకలకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ఎ.సత్యప్రసాద్, అనకాపల్లిలో జరిగిన వేడుకలకు హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సందేశాలిచ్చారు. వేడుకల్లో భాగంగా తలపెట్టిన సాంస్కృతిక సంబరాలు అబ్బురపరిచాయి. శకటాలు ఆకట్టుకున్నాయి.

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, విశాఖ కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధిచేసి మొదటి స్థానంలో నిలిపేందుకు అంకితమవుదామని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. సముద్రతీర, మైదాన, గిరిజన ప్రాంత, పారిశ్రామిక వాడలతో సమ్మిళతమైన జిల్లాను అభివృద్ధిలో అగ్రభాగాన నిలపాలన్నారు. అనకాపల్లి ఎన్‌టిఆర్ స్టేడియంలో గురువారం నిర్వహించిన 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆమె జాతీయపతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యకరమైన భవిష్యత్ నిర్మాణానికి నిబద్ధతతో కృషిచేయాలన్నారు. గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా యువత వుండాలన్నారు. మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా మార్చడానికి చేస్తున్న కృషిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలన్నారు. సమగ్ర పురోగతి సాధనకు, పేదరిక నిర్మూలన, శాంతిభద్రతలు కాపాడ్డానికి సహాయసహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్‌పి దిపిక, ఎంపీ సిఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, జాయింట్ కలెక్టర్ జాహ్నవి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సందేశమిస్తున్న జివిఎంసి కమిషనర్ సంపత్ కుమార్

విశాఖలో..

విశాఖ నగరంలోని పోలీసు బ్యారెక్స్ మైదానంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం సమర్పించారు. పరేడ్ కమాండర్ ఎఆర్ ఎసిపి సీతారామ్ ఆధ్వర్యంలోని పోలీసు దళం మంత్రికి సెల్యూట్ సమర్పించగా, బ్యాండ్ బృందం జాతీయ గీతాన్ని ఆలపించింది. పరేడ్ కమాండర్ స్వాగతం మేరకు ప్రత్యేక వాహనంలో పరేడ్ మైదానాన్ని సందర్శించి పోలీసు దళాల నుంచి గౌరవ వందనాన్ని మంత్రి స్వీకరించారు. అనంతరం ఆయన సభా వేదిక వద్దకు చేరుకొని త్రివర్ణ బెలూన్లను గాలిలోకి వదిలారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం అసువులు బాసిన అమరవీరులను ముందుగా స్మరించుకున్నారు. సమాజంలో అందరూ సత్సమానంగా ఎదిగినప్పుడు, మిగతా 2లో..

పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఆకట్టుకున్న ప్రదర్శన

ఐఐటి, ఎన్‌ఐటిల్లో విశాఖ విద్యార్థులుండాలి

వార్త 2లో..

ఎయులో భోజన నాణ్యత తనిఖీ

వార్త 2లో..

రుషికొండ ఆక్రమణపై ఫిర్యాదు

వార్త 3లో..

కొనసాగిన జూడాల ఆందోళన

- కెజిహెచ్‌లో పలు సేవలు నిలిపివేత
- హత్యాచార నిందితున్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్

నిరసన తెలుపుతున్న వైద్య విద్యార్థులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కొల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్యగావించిన నిందితున్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్ర మెడికల్ కళాశాల విద్యార్థులు (జూనియర్ డాక్టర్లు) గురువారం కళాశాల ఎదుట ఆందోళనకు దిగారు. అత్యవసర సేవలు మినహా కెజిహెచ్‌లో తాము పలు సేవలను నిలిపివేసినట్టు ప్రకటించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ టి.పృథ్వీరాజ్, కార్యదర్శి వై.రాజ వివేక్ మాట్లాడుతూ సెంట్రల్ హెల్త్ కేర్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. జూనియర్ డాక్టర్‌పై హత్యాచారాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఆందోళనలు సాగుతూ ఉంటే సంఘటన జరిగిన ఆర్‌జికెఆర్ ఆసుపత్రిలో కొంతమంది దుండగులు బుధవారం రాత్రి చేరి కర్రలతో దాడి చేశారని, హాస్పిటల్ ఆస్తులను ధ్వంసం చేశారని మిగతా 2లో..

స్వాతంత్ర్య ఫలాల సాధనకు యువత ముందుకు రావాలి

ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ

మాట్లాడుతున్న అజశర్మ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎందరో నాయకులు, కార్మికులు, మహిళల వీరోచిత పోరాటాలు, త్యాగాలు, బలిదానాల ఫలితంగా స్వాతంత్ర్యం సాధించుకున్నామని, ఆ లక్ష్యాలు మనకు చేరువ కాలేదని, వాటిని సాధించేందుకు యువత ముందుకు రావాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ పిలుపునిచ్చారు. గురజాడ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో అల్లూరి విజ్ఞాన కేంద్రంలో గురువారం జరిగిన స్వాతంత్ర్య సంబరాలను ఆయన ప్రారంభించారు. స్వాతంత్ర్య పోరాట చరిత్రను వివరించారు. అల్లూరి విజ్ఞాన కేంద్రం బాధ్యులు విఎస్.పద్మనాభరాజు మాట్లాడుతా స్వాతంత్ర్యం ద్వారా లభించిన లౌకికతత్వం, సామాజిక నాయ్యం ప్రమాదంలో పడ్డాయని, వాటిని కాపాడుకోవాలని అన్నారు. గురజాడ సాంస్కృతిక వేదిక కార్యదర్శి దండు నాగేశ్వరరావు మాట్లాడుతూ గురజాడ మన అడుగుజాడ కావాలని, ఆయన ఆశయాలు, దేశభక్తి, అభ్యుదయ భావాలు ప్రచారం ద్వారా ప్రజానీకం, ముఖ్యంగా యువతను చైతన్యవంతులను చేయడానికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షులు పివి.రమణ, అల్లు వెంకటరమణ, కె.సూర్యనారాయణ, ఆశ్రఫ్, బొట్టా వేణు పాల్గొన్నారు. వేదిక సహాయ కార్యదర్శి ఆర్ఎస్ఆర్.మూర్తి వందన సమర్పణ చేశారు.

నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్న విద్యార్థులు

మొదటి పేజీ తరువాయి..

జిల్లా అభ్యున్నతికి కృషి

విద్యా, వైద్య సేవలను సంపూర్ణంగా పొంది, పేదరికం నుంచి విముక్తి పొందినప్పుడే నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లు అని పేర్కొన్నారు. ఈ మధ్యకాలంలో గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలకు ప్రజలు, ముఖ్యంగా యువత బానిసలవుతున్నారని, ఇది చాలా ఆందోళన కలిగించే అంశమని అన్నారు. పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి స్థిరమైన అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.

ప్రశంసా పత్రాలు ప్రదానం

వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన సేవకులకు, అధికారులకు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను మంత్రి సత్యప్రసాద్ అందజేశారు. జిల్లాలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న 416 మంది అధికారులు, సిబ్బందికి మంత్రి సర్టిఫికెట్లను అందించారు. ఉత్తమ ప్రతిభ చూపిన పోలీసులకు పతకాలను బహూకరించారు. వేడుకల్లో విశాఖ పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్, శాసనమండలి సభ్యులు వి.చిరంజీవిరావు, డి.రామారావు, శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు, పి.విష్ణుకుమార్ రాజు, సిహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, జాయింట్ పోలీసు కమిషనర్ డాక్టర్ కె.ఫక్కీరప్ప, డిసిపి కె.శ్రీనివాసరావు, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, విఎంఆర్‌డిఎ కమిషనర్ కెఎస్.విశ్వనాధన్, జివిఎంసి కమిషనర్ పి.సంపత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక సంబరాలు

పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు జాతీయ సమైక్యతను చాటి చెప్పాయి. బివికె కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన హర్ ఘర్ తిరంగా స్వాగత నృత్య ప్రదర్శన ఆహూతులను అలరించగా, 60 అడుగుల మువ్వన్నెల జెండా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సారే జహాంచే అచ్చా గీతానికి పద్మనాభం కెజిబివి విద్యార్థులు చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. మేఘాద్రిగెడ్డ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకులం విద్యార్థులు ప్రదర్శించిన ఘర్ ఘర్ తిరంగా, పుణ్య భూమి నాదేశం గీతానికి కణితి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు చేసిన నృత్యాలు ఆద్యంతం అలరించాయి.

జివిఎంసిలో..

జివిఎంసి ప్రధాన కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను కమిషనర్ పి.సంపత్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కమిషనర్, అధికారులతో కలిసి ముందుగా జీవీఎంసీ కార్యాలయ సమీపాన మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మహాత్ముల త్యాగనిరతిని గుర్తు చేస్తూ సందేశాన్ని అందించారు. అనంతరం చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జివిఎంసి సెక్రటరీ పి.నల్లనయ్య రచనా సహకారంతో మాధవధార హైస్కూల్ విద్యార్థులచే 'సకాలంలో పన్నులు చెల్లించండి', 'క్లీన్ అండ్ గ్రీన్ విశాఖ' అనే దృశ్య రూపకాలను విద్యార్థులు ప్రదర్శించారు.

కొనసాగిన జూడాల ఆందోళన

తెలిపారు. ఇది అత్యంత దుర్మార్గమన్నారు. ఈ సంఘటన నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలని తమ అసోసియేషన్లు పిలుపునిచ్చాయన్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం విశాఖ బీచ్ రోడ్‌లో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టనున్నామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు డాక్టర్ ఎం.ప్రియాకృష్ణవేణి, డాక్టర్ ఊహ రాపేటి, డాక్టర్ ఎన్.జగదీశ్వరరావు, డాక్టర్ కె.సంయుక్త, డాక్టర్ సి.శ్రీనాగాకిరణ్ కుమార్, డాక్టర్ రియాజ్ పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ మోహన్‌రావుకు పురస్కారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకుగాను మధురవాడ సబ్ రిజిస్ట్రార్ మోహన్‌రావుకు ప్రశంసా పురస్కారం లభించింది. 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా పోలీస్ బ్యారెక్స్‌లో నిర్వహించిన వేడుకలలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ చేతుల మీదుగా ఆయన ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.

ఆక్సిజన్ థెరపీ పరికరంతో ప్రయోజనాలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: హైపర్బారిక్ ఆక్సిజన్ థెరపీ పరికరం సాయంతో స్వచ్ఛమైన ఆక్సిజన్ థెరపీతో చికిత్స వేగవంతమౌతుందని కార్డియో థొరాసిక్, వాస్క్యులర్ సర్జన్ హరివర్ధన్ లూకా అన్నారు. సౌత్ ఇండియాలోనే మొట్టమొదటిసారిగా వెంకటేశ్వర ఫౌండేషన్ ఆధ్వర్యంలో పందిమెట్ట జంక్షన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన హైపర్బారిక్ ఆక్సిజన్ థెరపీ ప్రాణవాయు పరికరాన్ని గురువారం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, విశాఖ ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ హరివర్ధన్ మాట్లాడుతూ వైద్య రంగంలో అత్యాధునిక పరికరాన్ని విశాఖలో ఏర్పాటు చేశామన్నారు. ఇది వైద్య చికిత్సకు దోహదపడడంతోపాటు రోగుల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంచుతుందని, మెదడు, గుండె, ఊపిరితిత్తులకు రక్త ప్రసరణ ద్వారా డిప్రెషన్, ఆందోళనను తగ్గిస్తుందని, శరీరంలో మెరుగైన కణాల పెంపునకు ఎంతో ఉపకరిస్తుందని అన్నారు. విశాఖ వాసులు ఈ పరికరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గౌతు లచ్చన్నకు ఘననివాళి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఉద్యమాల నిప్పుకణిక, బ్రిటీషర్లను ఎదురొడ్డిన ధీశాలి సర్దార్ గౌతు లచ్చన్న అని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. గురువారం హర్‌ఘర్ తిరంగా ఉత్సవాల్లో భాగంగా గ్రీన్ పార్క్ జంక్షన్‌లోని స్వాతంత్ర సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

ఐఐటి, ఎన్‌ఐటిల్లో విశాఖ విద్యార్థులుండాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాబోయే రోజుల్లో ఐఐటి, ఎన్‌ఐటిల్లో విశాఖ విద్యార్థులే ఉండాలని, ఆ దిశగా చదువులో ముందుకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. పదో తరగతిలో 575కు పైగా మార్కులు సాధించిన వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 62 మంది విద్యార్థుల అభినందన కార్యక్రమం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం విద్యా శాఖ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లోనూ మంచి మార్కులు తెచ్చుకోవాలని ఉద్బోధించారు. ఇంజినీర్, డాక్టర్, కలెక్టర్, జడ్జి, సైంటిస్ట్ ఇలా ఏదైతే కావాలని అనుకుంటున్నారో అందుకు తగిన విధంగా పోటీ పడి విద్యను అభ్యసించాలని సూచించారు. అపుడే అనుకున్న స్థాయికి చేరుకోగలరని తెలిపారు. చదువుతో పాటు ఇతర కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొనాలని పేర్కొన్నారు. ఈ అభినందన కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, జవహర్ నవోదయ వైస్ ప్రిన్సిపాల్ శరత్ చంద్ర కీర్తి, విశాఖ వేలీ ప్రిన్సిపాల్ ఈశ్వరి ప్రభాకర్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పలుచోట్ల జెండా పండగ

పిఠాపురం కాలనీలో విశిష్ట వ్యక్తులకు సత్కారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సిరిపురంలోని విఎంఆర్‌డిఎ కార్యాలయ ఆవరణలో మెట్రోపాలిటన్ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్ జాతీయ పతాకాన్ని ఎగరవేశారు. కార్యక్రమంలో కార్యదర్శి కీర్తి, ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డి, ముఖ్య ప్రణాళికా అధికారి సంజయ్ రత్నకుమార్, ముఖ్య ఇంజినీర్ భవానీ శంకర్ పాల్గొన్నారు. విశాఖపట్నం రేంజ్ కార్యాలయంలో డిఐజి గోపీనాథ్ జెట్టి జాతీయ పతాకావిష్కరణ చేసి గౌరవ వందనం స్వీకరించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన వేడుకల్లో కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పాల్గొన్నారు. ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో) ప్రాంతీయ కేంద్రంలో వర్సిటీ సీనియర్ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు జాతీయ జెండా ఎగురవేశారు. శివాజీపాలెంలోని క్రెడాయ్ విశాఖపట్నం చాప్టర్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో చైర్మన్ కెఎస్ఆర్‌కె.రాజు (సాయి), మాజీ చైర్మన్ కెఎస్.చంద్రన్, వైస్ ప్రెసిడెంట్లు ఇ.అశోక్ కుమార్, సిహెచ్.గోవిందరాజు పాల్గొన్నారు.

పిఠాపురం కాలనీ పార్క్‌లో కాలనీ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ రమా ప్రభ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. విశిష్ట వ్యక్తులను సన్మానించారు. రిటైర్డ్ తహశీల్దార్ టి.రామ చంద్రరావు, ఇఆర్.మూర్తి తదితరులు సన్మానం అందుకున్నవారిలో ఉన్నారు. కార్యక్రమంలో కె.కోటేశ్వరరావు, యు.రామకృష్ణ, వెంకటేశ్వరరావు, వెంకటరావు, గాంధీ, పోలినాయుడు, డాక్టర్ శ్రీధర్, అడ్వకేట్లు అనురాధ, కల్పన, లెక్చరర్ లక్ష్మి ప్రభ, బాషా, ఆలీ పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం : ముస్తాఫా జంక్షన్‌లో సిపిఎం ఆధ్వర్యాన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. గంగాధర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సూరిబాబు, యు.రామస్వామి, పూర్ణచంద్రరావు, జగ్గారావు. వై.సత్యనారాయణ, ఒవి.రావు పాల్గొన్నారు.

కార్పొరేటర్ ఉషశ్రీకి అరుదైన గౌరవం

గవర్నర్‌తో కార్పొరేటర్, క్రీడాకారిణి ఉషశ్రీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి 43వ వార్డు కార్పొరేటర్, జనసేన నాయకురాలు, ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ ప్లేయర్ పెద్దిశెట్టి ఉషశ్రీకి అరుదైన గౌరవం దక్కింది. 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో భాగంగా గురువారం సాయంత్రం విజయవాడలోని రాజ్ భవన్‌లో గవర్నర్ ఎండి అబ్దుల్ నజీర్ నిర్వహించిన ఎట్ హోం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. బ్యాడ్మింటన్ క్రీడలో ఆమె చూపిస్తున్న అపార ప్రతిభకుగాను క్రీడాకారుల విభాగంలో ఆమెకు ఈ గౌరవం దక్కింది. ఈ సందర్భంగా ఆమె గవర్నర్‌తో మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడాభివృద్ధి కోసం సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తోనూ ఉషశ్రీ ముచ్చటించారు. రాజకీయాల్లో ఉత్సాహంగా పాల్గొంటూనే క్రీడల్లో రాణిస్తున్న ఆమెను పలువురు అభినందించారు.

ఎయులో భోజన నాణ్యత తనిఖీ

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల మెస్‌లో భోజన నాణ్యతను చీఫ్ వార్డెన్ ఆచార్య ఎస్.హరినాథ్ స్వయంగా పరిశీలించారు. గురువారం మధ్యాహ్నం భోజన సమయంలో మెస్‌కు వెళ్లి విద్యార్థులకు అందిస్తున్న భోజనం రుచి చూశారు. విద్యార్థులతో మాట్లాడి వారి అభిప్రాయాలు, సూచనలు తీసుకున్నారు. విద్యార్థులను భాగస్వామ్యం చేస్తూ ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేశామని తెలిపారు. స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు ప్రత్యేక మెనూతో భోజనం వడ్డించడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. భోజన నాణ్యతలో ఎంతో మార్పు వచ్చిందని విద్యార్థులు వివరించారు.

జివిఎంసి అధికారులకు పురస్కారాలు

ఎంవిపి.కాలనీ : విధి నిర్వహణలో అంకితభావం కనబరిచి ఉత్తమ సేవలు అందించినందుకుగాను 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో పలువురు జివిఎంసి ఉన్నతాధికారులకు ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్నారు. వారికి గురువారం పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పురస్కారాలను అందించారు. పురస్కారాలు అందుకున్నవారిలో కెవిఎన్.రవి (జివిఎంసి సూపరింటెండింగ్ ఇంజినీర్), కె.రామమోహన్‌రావు (జివిఎంసి సూపరింటెండింగ్ ఇంజినీర్), పివివి.సత్యనారాయణ రాజు (జివిఎంసి సూపరింటెండింగ్ ఇంజినీర్), ఎంవిడి ఫణిరామ్ (జివిఎంసి ప్రాజెక్ట్ డైరెక్టర్ - యుసిడి), సిసి వాసుదేవరావు (జివిఎంసి ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్), ఎం.వినయ్ కుమార్ (జివిఎంసి చీఫ్ ఇంజినీర్), వై.శ్రీనివాసరావు (జివిఎంసి అదనపు కమిషనర్), ఎస్ఎస్.వర్మ (జివిఎంసి అదరపు కమిషనర్) ఉన్నారు.

ఆనందపురం విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి -ఆనందపురం: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో గోపాలపట్నంలో నిర్వహించిన జీవ వైవిధ్య వ్యాసరచన పోటీల్లో ఆనందపురం విద్యార్థి ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.రామకృష్ణ పట్నాయక్ తెలిపారు. జిల్లా స్థాయిలో 42 పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొనగా ఆనందపురం గ్రామానికి చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి లీలావర్ధన్ వ్యాసరచన పోటీలో మూడవ స్థానంలో నిలిచాడని పేర్కొన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్, రెవెన్యూ మంత్రి సత్యప్రసాద్, డిఇఒ చంద్రకళ చేతుల మీదగా విద్యార్థికి ప్రశంసాపత్రం, మెమొంటోను అందజేశారు. విద్యార్థికి పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు

విజయవంతంగా స్పోర్ట్స్ మీట్

ప్రజాశక్తి-పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కాలేజీలో 13వ వార్షిక స్పోర్ట్స్ మీట్ ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు విజయవంతంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎన్ఇ ఫ్లోరా తెలిపారు. పురుషుల విభాగంలో కబడ్డీ, ఖోఖో, క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, 100 మీటర్ల రన్నింగ్, చెస్, క్యారమ్స్, మహిళా విభాగంలో ఖోఖో, కబడ్డి, బ్యాడ్మింటన్, చెస్, క్యారమ్స్, త్రోబాల్, టెన్నికాయిట్, మ్యూజికల్ చైర్, తదితర క్రీడలు నిర్వహించామని, సుమారు 330 మంది పాల్గొన్నారని తెలిపారు. 160 మందికి స్వర్ణం, రజతం, కాంస్యం పతకాలతో సర్టిఫికెట్లను అందజేశామని పేర్కొన్నారు. ప్రతిభావంతులైన క్రీడాకారులకు తమ కళాశాల వెన్నెముకలా ఉంటుందని కళాశాల సెక్రటరీ టి.థియోఫిలస్ తెలిపారు.

'కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి' బహుముఖ సేవలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : కలిగొట్ల స్నిగ్ధశ్రీ జయంతి సందర్భంగా స్థానిక కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యాన గురువారం భీమిలి చిన్న బజారులోని ఫౌండేషన్ కార్యాలయం ఆవరణలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ప్రమాద వశాత్తూ ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన మండలంలోని మజ్జివలసకు చెందిన బోనిల త్రినాథ్‌కు నెలకు సరిపడా నిత్యావసర సరుకులతో పాటు రూ.5వేలు అందజేశారు. ఇదే మండలం తాటితూరు జెడ్పీ హైస్కూల్ గ్రంథాలయం నిర్వహణకు రూ.20 వేలు, పలువురు పేద విద్యార్థులకు దుస్తులు, మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జైళ్ల శాఖ సూపరింటెండెంట్ సన్యాసిరావు, సిఐ డి.రమేష్, ఆర్అర్ ఇంజినీరింగ్ ఎమ్‌డి శ్రీనివాస్, కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ కె.శ్రీరామచంద్రమూర్తి చేతుల మీదుగా ఈ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఫౌండేషన్ సభ్యులు సూర్యనారాయణమూర్తి, భానోజీరావు, శ్రీనివాసరావు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ ఆర్థిక సాయంతో ముద్రించిన 'అందాల జాబిలి.... భీమిలి' పుస్తకాన్ని రచయిత పి.రాజేంద్రప్రసాద్‌వర్మతో కలిసి ప్రముఖులు ఇదే వేదికపై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రచయిత వర్మను ఘనంగా సత్కరించారు. ఎంఇఒ ఎం.శివరాణి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జైళ్ల శాఖ సూపరింటెండెంట్ సన్యాసిరావు

రుషికొండ ఆక్రమణపై ఫిర్యాదు

ప్రజాశక్తి -మధురవాడ : రుషికొండ ఐటి సెజ్‌కు వెళ్లే మార్గం సిఆర్‌జెడ్‌లో అక్రమ నిర్మాణాలపై జిల్లా కలెక్టర్‌కు, జివిఎంసి కమిషనర్‌కు, చీఫ్ సిటీ ప్లానర్‌కు ఫిర్యాదు చేసినట్లు జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ తెలిపారు. ఐటి సెజ్‌కు వెళ్లే బీచ్ రహదారి తీరప్రాంత క్రమబద్ధీకరణ మండలి (సిఆర్‌జెడ్) 2011/2019 నోటిఫికేషన్ ప్రకారం అభివృద్ధి నిషేధ ప్రాంతంలోకి వస్తున్న కొందరు ప్రయివేటు వ్యక్తులు ఇసుకతిన్నెలపైన బండరాళ్లు, గ్రావెల్ వేసి విధ్వంసం చేస్తున్నారని వివరించారు. తీర ప్రాంతంలో శాశ్వత కాంక్రీట్ నిర్మాణాలు చేస్తూ పర్యావరణ విఘాతం కలిగిస్తున్నారని తెలిపారు. ఈ ఆక్రమణపై ఈ నెల 11వ తేదీన మండల రెవెన్యూ అధికారులకు, జివిఎంసి జోన్-2 పట్టణ సహాయ ప్రణాళిక అధికారికి ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వ రంగంతోనే నాణ్యమైన వైద్యం

ప్రజాశక్తి-మాధవధార : వైద్యం ప్రభుత్వ రంగంలో ఉంటేనే పేద, మధ్య తరగతి ప్రజలకు నాణ్యమైన సేవలు అందుతాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ మూల వెంకటరావు పేర్కొన్నారు. వైద్య రంగంలో పిపిపి పద్ధతిని ప్రవేశపెట్టాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన ఆందోళన కలిగిస్తుందని తెలిపారు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పిపిపి మోడల్ ప్రైవేట్ రంగానికి ఉపయోగం తప్ప ప్రజలకు లాభం ఉండదని తెలిపారు.

నేరాలు ఘోరాలు

బెల్ట్ షాపుల నిర్వాహకులు అరెస్ట్

ప్రజాశక్తి- మునగపాక : అక్రమంగా మద్యం అమ్ముకాలు సాగిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై ప్రసాదరావు తెలిపారు. మండలంలోని మూలపేట, రాజుపేట, పెద్ద యాదగిరి పాలెం గ్రామాలలో గుట్టుచప్పుడు కాకుండా బెల్ట్ షాపులను నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో షాపులపై దాడి చేయడం జరిగిందని తెలిపారు. వారి వద్ద నుండి 124 మద్యం బాటిల్ స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు చెప్పారు.

ఆర్ఎంపి వైద్యులకు డిజిటల్ సభ్యత్వాలు

ప్రజాశక్తి -ఆనందపురం : వేములవలస ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆర్ఎంపి వైద్యులకు డిజిటల్ సభ్యత్వ సర్టిఫికెట్లను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా న్యూరాలజిస్ట్ డాక్టర్ సునీల్, రాష్ట్ర ఫెడరేషన్ ముఖ్య సలహాదారులు డాక్టర్ ఎన్.ఎల్.రావు మాట్లాడుతూ, నూతన టెక్నాలజీతో క్యూఆర్ కోడ్లను ప్రవేశపెడుతూ సభ్యత్వ సర్టిఫికెట్లను అందజేస్తున్నట్లు తెలిపారు. సంఘ వ్యవస్థాపకుడు జంగం జోషి మాట్లాడుతూ, త్వరలోనే మూడు జిల్లాలకు నూతన సభ్యత్వ పత్రాలను అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.సుగుణేశ్వరి, కోన ప్రకాష్, పోతిరెడ్డి సుధాకర్ రెడ్డి, పచ్చిపులుసు కనకారావు, పడాల వినోద్, కోటేశ్వరరావు, అను, జిబి. రాజు, అమిత్ కుమార్ పాల్గొన్నారు.

శిల్పారామంలో కూచిపూడి నాట్యం

ప్రజాశక్తి -మధురవాడ : శిల్పారామం జాతరలో ఆముదాలవలసకు చెందిన ఆశ్రిత కూచిపూడి నాట్యనికేతన్ చిన్నారులు నాట్యాన్ని ప్రదర్శించారు. దేశ భక్తి గీతాలను ఆలపించారు. శిల్పారామం పరిపాలనాధికారి టి.విశ్వనాథరెడ్డి పర్యవేక్షించారు.

ప్రజా సంఘాల ఆధ్వర్యాన స్వాతంత్ర్య దినోత్సవం

ప్రజాశక్తి-యంత్రాంగం

స్వాతంత్ర్య దినోత్సవాన్ని సిపిఎం, పలు ప్రజాసంఘాల ఆధ్వర్యాన గురువారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాలను ఎగురవేశారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యాన...

ములగాడ : క్రాంతినగర్ భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యాన జాతీయ పతాకాన్ని మాజీ సైనికుడు సిదిరెడ్డి జోగిరాజు ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.జోగిరాజు, గ్రామ సంఘం పూర్వ అధ్యక్షులు బి.చంద్రరావు, గ్రామ నాయకులు జి.దుర్గాప్రసాద్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు డి.సత్తిబాబు, కె.చిట్టిబాబు, వై.లక్ష్మణరావు, వై.ఆనందరావు, కె.నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

కొద్దిమందికే స్వాతంత్ర్య ఫలాలు : పద్మ

విశాఖ కలెక్టరేట్ : దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు పూర్తయినా స్వాతంత్ర్య ఫలాలు కొద్దిమంది కోటీశ్వరులకు మాత్రమే అందుతున్నాయని ఐద్వా విశాఖ జిల్లా అధ్యక్షులు బి.పద్మ అన్నారు. కంచరపాలెం జోన్‌లోని మాధవధార, బర్మా క్యాంపు, శివ నగర్ ఏకలవ్యకాలనీ, హష్మీ భవనం, బిఎన్ఆర్ భవనం వద్ద 78వ స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మన పూర్వీకులు చేసిన త్యాగాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రక్కకు నెట్టి దేశంలో మనువాదాన్ని అమలు చేయాలని చూస్తుందన్నారు.

మాధవధారలో సిపిఎం సీనియర్ నాయకులు వరహాలు జెండా ఆవిష్కరణ చేశారు. నాయనబాబు, రాజు, ఎస్. రాంగోపాల్, ఎస్.శ్రావణ్, కె.పార్వతి పాల్గొన్నారు. బర్మా క్యాంపులో ఐద్వా నాయకులు రమ పతాకావిష్కరణచేశారు. సిహెచ్ కమల, జి.దేవి, జి.అలేఖ్య, సీత, సిహెచ్.రాజా మాట్లాడారు. బిఎన్ఆర్ భవనం వద్ద ఎస్.అప్పలరాజు పతాకవిష్కరణ చేశారు. బొట్టా ఈశ్వరమ్మ, ఎం.ఈశ్వరరావు, ఒ.అప్పారావు, బొట్టా నరసింగరావు ఫౌండేషన్ కార్యదర్శి బుజ్జి, ఎస్.సోమేశ్వరరావు, పి.రామారావు, ఒ.విజయ పాల్గొన్నారు. హష్మీ భవనం వద్ద అరుణ్‌జీ, శివనగర్‌లో ఎం.జయలక్ష్మి పతాకావిష్కరణ చేశారు. కాత్యాయిని, రాజేశ్వరి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జోన్ 2, 3, 8లలో జరిగిన కార్యక్రమాల్లో జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్ధరాత్రి వచ్చిన స్వాతంత్ర్యానికి ఇంకా తెల్లవారలేదని వ్యాఖ్యానించారు. పేదల జీవితాలలో వెలుగు రాలేదన్నారు. ఈ కార్యక్రమాల్లో బోని రాము, టి.కాలియమ్మ, వెంకటరావు, జి సూర్యనారాయణ, ఎస్ఎస్.సత్యనారాయణ, ఎస్ఐ.సూరిబాబు, బి.రత్నం, అనిల్ కుమార్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

మంది మెట్ట వద్ద కె.మణి ఆధ్వర్యాన విశాఖ చిల్డ్రన్స్ క్లబ్ పిల్లలతో ఉత్సవాలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వచ్చిన ఉపాధ్యాయిని సరోజ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సత్యవతి తదితరులు పాల్గొన్నారు. కోటవీధి జివిఎంసి ఉర్దూ స్కూల్ వద్ద ఆవాజ్ ఆధ్వర్యాన స్వాతంత్ర్య వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటలు, పాటలు, డ్యాన్సు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ మహమ్మద్ ఖలీద్ ప్రసాద్, స్కూలు చైర్ పర్సన్ సలీమా, ఎఎస్‌కె ఫౌండేషన్ చైర్‌పర్సన్ ఎఐ అశ్రఫ్, ఆవాజ్ అధ్యక్షులు ఎమ్‌డి అయూబ్ తదితరులు పాల్గొన్నారు. సింగ్ హోటల్ జంక్షన్, రాంనగర్ జంక్షన్ భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కె.నరసింగరావు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కె.సోములు, రామారావు, చిట్టిబాబు, శ్రీను, అప్పారావు, మూర్తి, వెంకటరావు, జనార్ధనరావు, సింహాద్రి లక్ష్మి, పార్వతి, సిఐటియు జగదాంబ జోన్ నాయకులు కెవిపి చంద్రమౌళి, ఎం.సుబ్బారావు తదితరులు పాల్గొని స్వాతంత్ర్య దినోత్సవ సందేశం ఇచ్చారు.

సీతమ్మధార :తాటిచెట్లపాలెంలోని ఎస్ఆర్‌నగర్‌లో కాలనీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గౌరీష్, రాజు జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు రాజు, పద్మ, రాంబాబు, రమణ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

జోగవానిపాలెంలో

గాజువాక : జివిఎంసి 67వ వార్డు పరిధి జోగవానిపాలెంలో సిపిఎం, పెన్షనర్స్, హౌస్ ఓనర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. పెన్షనర్స్ నాయకులు వై.సుబ్బారావు జెండా ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.కిరీటం, కె.సంతోషం, యువిపి వర్మ పాల్గొన్నారు.

సిఐటియు స్టీల్ డివిజన్ కమిటీ ఆధ్వర్యాన పెదగంట్యాడ ఆఫీసులో, హౌసింగ్ బోర్డులోని ఆటో స్టాండ్ వద్ద జెండాలను ఎగురవేశారు. ఈ కార్యక్రమాల్లో సిపిఎం స్టీల్ జోన్ కార్యదర్శి శ్రీనివాసరాజు, సిఐటియు నాయకులు నమ్మి రమణ, జి.శ్రీనివాసరావు, పి.అప్పలరెడ్డి, బి.గురప్ప, డి.వెంకటరావు, సిహెచ్.రాముడు, కొవిరి అప్పలరాజు, బి.ఆనంద్, బి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

జివిఎంసి 69వ వార్డు పరిధి శీలానగర్‌లో ఐద్వా జోన్ కమిటీ నాయకులు జి.మణి పతాకావిష్కరణ చేశారు. కాలనీ కమిటీ సభ్యులు, ప్రజాతంత్ర ఉద్యమ నాయకులు పాల్గొన్నారు.

పెందుర్తి : జివిఎంసి 94వ వార్డు పరిధి చైతన్యనగర్ కార్మిక నగర్ భూ పోరాటం కేంద్రం, సుజాతనగర్ ఆటో స్టాండ్ ప్రాంతాల్లో సిపిఎం జోన్ కార్యదర్శి బి.రమణి జాతీయ జెండాలను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు శంకర్రావు, అప్పలనాయుడు, అప్పలరాజు పాల్గొన్నారు

భీమునిపట్నం : సిఐటియు భీమిలి డివిజన్ కమిటీ ఆధ్వర్యాన పాత బస్టాండ్, సంగివలస, తగరపువలస హైవే జంక్షన్, సిఐటియు కార్యాలయం వద్ద త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఆర్ఎస్ఎన్.మూర్తి, రవ్వ నరసింగరావు, ఎస్.అప్పలనాయుడు, నమ్మి నాయుడు, పి.పెంటరాజు, నీలాతి రాము తదితరులు పాల్గొన్నారు.

క్రాంతినగర్‌లో...

ములగాడ : జివిఎంసి 63వ వార్డు పరిధి క్రాంతినగర్‌లో బాపూజీ గ్రామాభ్యుదయ సంఘం ఆధ్వర్యాన స్వాతంత్ర్యదినోత్సవాన్ని నిర్వహించారు. జాతీయ పతాకాన్ని కోరిమిల్లి జగ్గప్పారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామ సంఘం గౌరవాధ్యక్షులు మరడాన జగ్గునాయుడు మాట్లాడుతూ, స్వాతంత్ర్యం సిద్ధించాక దేశం కొన్ని అంశాల్లో ముందడుగు వేసినా మహనీయుల కన్న కలలు సంపూర్ణంగా ఇప్పటికీ నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జాతిపిత మహాత్మాగాంధీ నాయకత్వంలో జాతీయ కాంగ్రెస్, కమ్యూనిస్టులు, కార్మికులు, రైతులు, యువజనులు, విద్యార్థులు, నావికులు, కవులు, కళాకారులు, సంఘసంస్కర్తలు, సమస్త ప్రజానీకం పోరాటం జరిపి భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించారన్నారు. దేశం నుంచి బ్రిటిష్ పాలకులను తరిమికొట్టి మనమే పరిపాలించు కుంటే దేశంలో దారిద్ర్యం, నిరుద్యోగం, నిరక్షరాస్యత, రైతుల ఆత్మహత్యలు, మహిళలపై అత్యాచారాలు వంటి అనేక సమస్యలు రూపుమాపవచ్చని కలలుగన్నారని తెలిపారు. పేద గొప్ప తారతమ్యం లేని సమ సమాజాన్ని, కులమత ఘర్షణలు లేని మతసామరస్యాని సాధించాలని, లౌకిక తత్వాన్ని పరిరక్షించుకోవాలని ఆశించారని చెప్పారు. స్వాతంత్ర్యం సిద్ధించాక ఇవి ఇప్పటికీ నెరవేరలేదన్నారు. దేశంలో ప్రజల సంపద అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ వ్యక్తుల చేతుల్లో పోగుపడే విధానాలను పాలకులు చేపట్టడం వల్ల, కొద్దిమంది ప్రజలకు కష్టాలు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహనీయులు కన్న కలలు నిజం చేసేందుకు ప్రతి ఒక్కరూ ప్రతిన బూనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సంఘం అధ్యక్షులు కోనపల్లి పరదేశినాయుడు, సంఘం నాయకులు పివి భాస్కరరావు, జి.సత్యనారాయణ, జి.కనకారావు, జి.గణ, ఎస్.వాసు, పి.సురేష్, సత్తిబాబు, అప్పారావు, భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ), క్రాంతి యూత్‌కు సంబంధించిన గ్రామ యువకులు పాల్గొన్నారు. పిల్లలు జాతీయ గీతాలను ఆలపించారు.

బాపూజీ గ్రామాభ్యుదయ సంఘం ఆధ్వర్యాన వేడుకలు

వాడవాడలా త్రివర్ణ పతాక రెపరెపలు

తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్‌లో మాట్లాడుతున్న తవిటయ్య

ప్రజాశక్తి-యంత్రాంగం

విశాఖ జిల్లా వ్యాప్తంగా వాడవాడలా గురువారం త్రివర్ణపతాకాలు రెపరెపలాడాయి. 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని నిర్వహించుకుంటూ స్వాతంత్రోద్యమ నాయకులను స్మరించుకున్నారు.

గాజువాక : గాజువాక తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్‌లో అపార్ట్‌మెంట్ అసోసియేషన్ మాజీ ప్రెసిడెంట్ మత్స్యరాజు జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు ఎం.వెంకటేశ్వరరావు, సెక్రటరీ ఎ.తవిటయ్య, ఉపాధ్యక్షులు బి.తౌడన్న, చిన్నంనాయుడు, మహిళా ప్రెసిడెంట్ బి.మణి, పిల్లలు, పెద్దలు పాల్గొన్నారు.

షీలానగర్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన వేడుకల్లో డాక్టర్ ఫసిహ జహీర్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు బిఎస్ఎన్.రాజు, వై.సత్యవతి, కృష్ణమోహన్, సత్యారావు, అధికారి శ్రీను, వెంకటేశ్వరరావు, ఎస్‌డివిఎస్ శ్రీను, జిసిఎస్.నాయుడు పాల్గొన్నారు.

శ్వేతా శ్రీ స్కూల్లో జాతీయ జెండాను సిపిఎం జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో నాయుడు రమేష్, ప్రిన్సిపల్ సీత పాల్గొన్నారు.

జివిఎంసి 67వ వార్డు సాయిరాంనగర్‌లోని స్వామి విద్యానికేతన్ హైస్కూల్‌లో వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు పతాకావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో పెదగంట్యాడ పిహెచ్‌సి వైద్యాధికారి పి.హేమలత, స్కూల్ ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మణస్వామి, కరస్పాండెంట్ దేవి, తుంపాల శ్రీరామమూర్తి, పాల్గొన్నారు.

వేపగుంట : నరవలోని విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో కళాశాల చైర్మన్ జి.సత్యనారాయణతో కలిసి జిఎస్‌టి, కస్టమ్స్ కమిషనర్ ఈదర రవికిరణ్ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ బి.భాస్కరరావు, సుబ్బరాజు పాల్గొన్నారు.

ఆనందపురం : అనందపురం మండలం ఎల్‌వి పాలెం ఎస్సీ కాలనీ దళిత నాయకుడు సియాద్రి రాంబాబు ఆర్థిక సాయంతో స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు, పలకలు, పెన్నులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పేకేరు హెడ్ మాస్టర్ వి.సన్యాసిరావు, యాగటి రామారావు పాల్గొన్నారు. మండలంలోని తర్లువాడ ఎంపిపి పాఠశాల విద్యార్థులకు ఓషియన్ ఫార్మసీ, చందల అప్పలరాజు ఆధ్వర్యాన టీ షర్టు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మజ్జి శ్రీను, బాలి సతీష్ పాల్గొన్నారు.

ఆనందపురం ఎంపియుపి స్కూల్లో జాతీయ జెండాను ఎగరవేశారు. ఆనందపురం జిల్లా పరిషత్ హైస్కూల్లో 10వ తరగతి ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు జై జవాన్ ఫౌండేషన్ తరపున రూ.3000, ఫౌండేషన్ షీల్డ్ సర్టిఫికెట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు కుప్ప రామలక్ష్మి, ముడుసల శ్రీను పాల్గొన్నారు గుడిలోవ ఏక్యుజె కళాశాలలో జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ఐహెచ్ ఫారుఖి, ప్రిన్సిపల్ సుధారాణి పాల్గొన్నారు

గిడిజాల టిడిపి నాయకులు కోరాడ వైకుంఠం ఆధ్వర్యాన 300 అడుగులు త్రివర్ణ పతాకంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు ర్యాలీ నిర్వహించారు.ముఖ్యఅతిథిగా ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్ హాజరయ్యారు.

గంభీరం పంచాయతీ బోయపాలెం ప్రాథమిక ఉన్నత పాఠశాలలో అన్ని తరగతులకు సంబంధించి 24 మంది విద్యార్థులకు షీల్డ్స్, బహుమతులను ఓఎస్జి ఫౌండేషన్ ఫౌండర్ శివ దళాయి అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ చల్లా రామిరెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆనందపురం మండలం శొంఠ్యాం గ్రామంలో శ్రీ వెంకట్ విద్యాపీఠ్ పాఠశాల విద్యార్థులు పలు విన్యాసాలు చేసి ఆకట్టుకున్నారు. పాఠశాల డైరెక్టర్ రొంగలి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మార్షల్ ఆర్ట్స్, కరాటే ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లెంక రాంబాబు, జనసేన నాయకులు కోరుకొండ మూర్తి పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలోని 22 గ్రామపంచాయతీల్లోని ప్రభుత్వ పాఠశాలలు, సచివాలయాలు, జిల్లా పరిషత్ హైస్కూళ్లు, ప్రైవేట్ పాఠశాలల్లో జాతీయ జెండాలను ఎగురవేశారు. పలుచోట్ల ఎంపిపి రాంబాబు, తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఆనంద్ కుమార్, విద్యుత్ శాఖలో జూనియర్ ఇంజినీరు రమేష్, పోలీస్ స్టేషన్‌లో సిఐ శ్రీధర్ జెండాలను ఎగరవేశారు.

పెందుర్తి : జివిఎంసి 97వ వార్డు పరిధి వుడా కాలనీ సమీపంలో ఉన్న రైల్వే విహార్‌లో వుడా రెసిడెన్షియల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ విన్నకోట రాము పతాకావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో కె.వరప్రసాద్‌రావు, ఆర్ఆర్.నాయుడు పాల్గొన్నారు

మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఇన్చార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమరావు జాతీయ జెండాను ఎగురవేశారు. పిఎం.పాలెం పోలీస్ స్టేషన్, చంద్రంపాలెం ఉన్నత పాఠశాల, విద్యుత్ కార్యాలయం, సిఐటియు, సిపిఐ, సిపిఎం కార్యాలయాలు, ఎండాడ జనసేన కార్యాలయం, చంద్రంపాలెం ఉన్నత పాఠశాల, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో జాతీయ జెండాలను ఎగురవేశారు.

మధురవాడలో పతాకావిష్కరణలో సిఐటియు నాయకులు

భీమునిపట్నం : భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు క్యాంపు కార్యాలయం వద్ద త్రివర్ణ పతాకాన్ని ఎమ్మెల్యే ఎగుర వేశారు. మాజీ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు క్యాంపు కార్యాలయం వద్ద 4వ వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండ బాబు, భీమిలి పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో సిఐ డి.రమేష్ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. చిప్పాడ దివీస్‌లో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ ఎస్ దేవేందర్, ఉపాధ్యక్షులు, ఎల్‌వి.రమణ పాల్గొన్నారు.

తగరపువలస శ్రీఎల్ల మాంబ టైలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భారీ త్రివర్ణ పతాకంతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పెంటపల్లి శ్రీనివాసరావు, చింతల సురేష్, నూలు గోవింద తదితరులు పాల్గొన్నారు. మాజీ కౌన్సిలర్ కొప్పల రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భీమిలి మండలం టి.నగర పాలెం గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ పొట్నూరు ఛాయా గౌతమి, జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయం వద్ద జెడ్సీ కె కనకమహా లక్ష్మి త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు.

భీమిలిలో గంటా శ్రీనివాసరావు...

ఆరిలోవ : విశాఖ కేంద్రకాగారంలో కారాగారం పర్యవేక్షణాధికారి ఎస్.కిషోర్ కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. సిబ్బంది కవాతును ప్రదర్శించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన సిబ్బందికి అవార్డులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అదనపు పర్యవేక్షణాధికారి వెంకటేశ్వర్లు, ఉప పర్యవేక్షణాధికారి ఎస్.కమలాకర్ పాల్గొన్నారు.

విమ్స్‌లో..

విమ్స్ ఆసుపత్రి ఆవరణలో విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ముందుగా ఆయన విమ్స్ సెక్యూరిటీ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఉత్తమ సేవలందించిన సిబ్బందికి మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు. ఉత్తమ సేవలకు గానూ విమ్స్ డైరెక్టర్ రాంబాబు పోలీసు గ్రౌండ్స్‌లో రెవెన్యూ శాఖ మంత్రి సత్య ప్రసాద్, జిల్లా కలెక్టర్ ఎంఎన్. హరేందిర ప్రసాద్, నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు.

ప్రభుత్వ బాలుర గృహంలో..

దీనదయాల్‌పురం ప్రభుత్వ బాలుర గృహంలో పర్యవేక్షణాధికారి వీరయ్య ఆధ్వర్యాన సంఘమిత్ర అధ్యక్షులు సూరిబాబు జాతీయ జెండాను ఎగురవేశారు.

ముడసర్లోవ వాకర్స్ అసోసియేషన్ వార్షికోత్సం, సాతంత్ర్య దినోత్సవం వేడుకలను ముడసర్లోవ రోడ్డులో నిర్వహించారు. మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎమ్మెల్మే వెలగపూడి రామకృష్ణబాబు, కార్పొరేటర్ కెల్ల సునీత జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేసారు. ఆటల పోటీల్లో విజేతలకు మెమోంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కెవివి.సుబ్రహ్మణ్యం, పల్ల శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

గోపాలపట్నం : గోపాలపట్నం బాలురు, బాలికల పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వై.వేణుగోపాలరావు పతాక ఆవిష్కరణ చేశారు. పలు పోటీల్లో విజేతలకు మెమోంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. పాఠశాల పూర్వ విద్యార్థి పాలకుర్తి నగేష్ కుమార్ ఆయన తల్లిదండ్రుల పేరు మీద రూ.1.04 లక్షలను మెరిట్ విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఎస్‌విఎల్‌ఎన్ జడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గోపాలపట్నం పరిసర ప్రాంతాలలో పౌర సంఘాలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలు, ఇతర సామాజిక సంఘాలు తమతమ కార్యాలయాల వద్ద జెండాలను ఎగురవేశాయి. ఎమ్మెల్యే గణబాబు గోపాలపట్నంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు

సీతమ్మధార : సీతమ్మధారలోని కార్యాలయంలో ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ఆధ్వర్యాన పతాకావిష్కరణ చేశారు. నాలుగో పట్టణ, ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో, స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జాతీయ పతాకాలను ఎగురవేశారు. ఈ కార్యక్రమాల్లో ఆర్ఐ ఇబ్రహీం, డీటీ త్రినాధరావు పాల్గొన్నారు. 26వ వార్డులో టిడిపి కార్పొరేటర్ ముక్క శ్రావణి ఆధ్వర్యాన వేడుకలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఎం.కిషోర్ కుమార్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

గోపాలపట్నంలో ఎమ్మెల్యే గణబాబు పతాకావిష్కరణ...

పద్మ పూజిత వీల్స్ మార్ట్ ఆధ్వర్యాన దొండపర్తిలోని సంస్థ కార్యాలయంలో చైర్మన్ బసవరాజు జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సాయిబాబు, శ్రీనివాసరావు, వేణు, కిరణ్ పాల్గొన్నారు.

విక్టరీ బైక్స్ ఆధ్వర్యాన దొండపర్తిలోని సంస్థ కార్యాలయంలో హరి రాజేష్ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

సీతమ్మధార క్షత్రియ కళ్యాణ మండపంలో క్షత్రియ సంక్షేమ సమితి ఆధ్వర్యాన జరిపిన వేడుకల్లో ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు జెండాను ఎగురవేశారు. పేద విద్యార్థులకు స్కాలర్ షిప్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డి.తిరుపతిరాజు, ఎఎల్ఎన్ రాజు పాల్గొన్నారు.

పతాకావిష్కరణలో కెకె.రాజు

ఉత్తమ సేవలకు అవార్డులు

అవార్డు అందుకుంటున్న ఆనందపురం ఎంపిడిఒ అప్పలనాయుడు

ప్రజాశక్తి -యంత్రాంగం

జిల్లాలోని పలు మండలాల్లో ఉత్తమ సేవలకు గాను పలువురు అధికారులకు జిల్లా కలెక్టర్ ద్వారా గురువారం అవార్డులు అందుకున్నారు.

ఆనందపురం : ఆనందపురం మండలం ఎంపిడిఒ నీలం అప్పలనాయుడు, ఇఒపిఆర్‌డి కెల్ల రామారావు, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ ఈసీ తిరుమలరావు, ఆనందపురం మండల ఆర్ఐ పి మణికంఠ, ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సామాజిక ఆరోగ్య అధికారి సాంబమూర్తి, బోని ఎంఎల్‌హెచ్ఒ జస్వంత్ ఉత్తమ సేవలకు గాను జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్, రెవెన్యూ మంత్రి ఎ.సత్యప్రసాద్ చేతుల మీదగా అవార్డులు అందుకున్నారు.

భీమునిపట్నం : జిల్లా ఇన్చార్జి మంత్రి ఎ.సత్యప్రసాద్, జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేందిర ప్రసాద్ చేతుల మీదుగా జివిఎంసి ఒకటో జోన్ పట్టణ ప్రణాళిక విభాగం అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఎసిపి) బి.శ్రీనివాసరావు గురువారం ఉత్తమ పురస్కారం అందుకున్నారు.

జిల్లా ఇన్చార్జి మంత్రి ద్వారా పురస్కారం అందుకుంటున్న జోన్ -1 టౌన్ ప్లానింగ్ ఎసిపి శ్రీనివాసరావు

జిల్లా అధికారులకు ప్రతిభా పురస్కారాలు

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని 14 మంది జిల్లా అధికారులు రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, కలెక్టర్ విజయకృష్ణన్ చేతుల మీదుగా ప్రతిభ పురస్కారాలను అందుకున్నారు. వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన మొత్తం 194 మందికి అవార్డులు అందజేశారు. అవార్డులు అందుకున్న జిల్లా అధికారుల వివరాలు...

ప్రజాశక్తి-అనకాపల్లి

బి.మోహన్‌రావు (జిల్లా వ్యవసాయ అధికారి), ఎస్.గోపాలరాజు (సర్వే ల్యాండ్స్ అండ్ రికార్డ్స్ ఏడి), కె.రాజశేఖర్ (ఎపిఇపిడిసిఎల్ నోడల్ అధికారి), పి.జయంతి (జిల్లా పౌర సరఫరాల మేనేజర్),

జి.రామారావు (జిల్లా ఎకనామిక్ స్టాటిస్టికల్ జెడి), ఎస్.మంజుల వాణి (జిఎస్‌డబ్ల్యుఎస్ నోడల్ ఆఫీసర్), శచీదేవి (డిఆర్‌డిఎ పిడి), జి.లక్ష్మణ్ (జిల్లా ఫారెస్ట్ అధికారి), జి.ప్రభాకర్‌రావు (జిల్లా ఉద్యానవన అధికారి), ఈ సందీప్ (డ్వామా పిడి), ఆర్.శిరీష రాణి (డిపిఒ),

జివిబి.జగదీష్ (డబ్ల్యుడిఎటిజిఎస్‌సి ఎడి), కెవిఎల్‌ఎన్.మూర్తి (డిసిఎస్‌ఓ), ఈ.నాగలక్ష్మి (డిపిఆర్‌పి ప్రిన్సిపాల్ జిల్లా కోఆర్డినేటర్)

అనితకు జిల్లా స్థాయి బహుమతి

ప్రజాశక్తి-కె.కోటపాడు : జీవవైవిధ్యం - సంరక్షణలో యువకుల పాత్ర అనే అంశంపై జిల్లాస్థాయిలో నిర్వహించిన డిబేట్ పోటీల్లో కె.కోటపాడు హైస్కూల్లో పదవ తరగతి చదువుతున్న జి.అనితకు ద్వితీయ స్థానం లభించింది. ఆమెకు అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించే స్వాతంత్ర్య వేడుకల్లో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత చేతుల మీదుగా షీల్డ్, ప్రశంసా పత్రం అందజేశారు. జిల్లా స్థాయి బహుమతి సాధించిన అనితను ప్రధాన ఉపాధ్యాయురాలు పద్మావతి, సైన్సు ఉపాధ్యాయులు ఎర్రునాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

అనితకు బహుమతి అందిస్తున్న మంత్రి



పంచాయతీ ఇఒ లవరాజుకు ప్రశంసాపత్రం

లవరాజుకు ప్రశంసా పత్రం

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది మేజర్ పంచాయతీ కార్యనిర్వహణ అధికారి ఎంవీఎస్ లవరాజుకి ఉత్తమ అధికారిగా రాష్ట్ర హోం మంత్రి అనిత, కలెక్టర్ విజయ్ కృష్ణన్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. అవార్డు గ్రహీతను డీపీఓ శిరీషా రాణి అభినందించారు.



రమేష్‌బాబుకు పురస్కారం అందిస్తున్న దృశ్యం

రమేష్‌బాబు, చిన్న అప్పారావులకు...

అచ్యుతాపురం : మండలంలోని తిమ్మరాజుపేట గ్రామానికి చెందిన జన మిత్ర మ్యాక్స్ ఎన్‌వైఎస్ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి కర్రి రమేష్ బాబు చేసిన సేవలకు గాను రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, ఎంపీ సీఎం.రమేష్ చేతుల మీదుగా ఉత్తమ సేవా ప్రశంసా పత్రం అందుకున్నారు. అలాగే చౌడపల్లి గ్రామ రెవెన్యూ అధికారి చిన్న అప్పారావుకు ఉత్తమ ప్రశంసా పత్రాన్ని రాష్ట్ర హెూంమంత్రి అందజేశారు.

సూర్యనారాయణకు...

చోడవరం : ఉత్తమ సేవలు అందించినందుకు గాను చోడవరం కార్మిక శాఖ అధికారి పి.సూర్యనారాయణ అల్లూరి జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ చేతుల మీదుగా గురువారం ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.

సూర్యనారాయణకు అల్లూరి కలెక్టర్ ప్రశంసా

సిపిఎం కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరిస్తున్న లోకనాథం

త్యాగాల ఫలితమే స్వాతంత్ర్యం

సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

ప్రజాశక్తి-అనకాపల్లి

దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో మహానుభావులు చేసిన త్యాగాల ఫలితంగానే స్వాతంత్ర్యం సిద్ధించిందని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం అన్నారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక సిపిఎం కార్యాలయం వద్ద గురువారం జాతీయ పతాకాన్ని లోకనాథం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేడు ఆ స్వాతంత్రాన్ని కొందరు స్వార్ధపర శక్తులు దుర్వినియోగం చేస్తున్నాయన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్ళు అయినా సామాన్య మధ్య తరగతి వారి పరిస్థితి మారలేదన్నారు. కార్మిక కర్షక వర్గాలు తమ హక్కుల కోసం ఏకం కావలసిన పరిస్థితి ఆసన్నమైందని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్ శంకరరావు, జి కోటేశ్వరరావు, సిపిఎం మండల కన్వీనర్ గంట శ్రీరామ్, నాయకులు వివి శ్రీనివాసరావు, తేలయ్య బాబు, ఈశ్వరరావు, ఉమామహేశ్వరరావు, సురేష్, చలపతి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధ మహిళలకు సత్కారం

ప్రజాశక్తి- అనకాపల్లి : పట్టణంలోని గవరపాలెం దిబ్బవీధి శ్రీసీతారామ దేవస్థానం ఆధ్వర్యంలో 78వ స్వాతంత్ర దినోత్సవంలో భాగంగా వినూత్న రీతిలో 70 సంవత్సరాలు పైబడిన పదిమంది వృద్ధ మహిళలకు ఘన సత్కారం చేశారు. వీరికి దిబ్బ వీధి సీతారామ దేవస్థానం చైర్మన్ దాడి భాస్కరరావు, ఆలయ సేవ దళ్ సభ్యులు శాలువాలతో సత్కరించి జ్ఞాపకాలు అందజేశారు. ఈ వేడుకలలో వీధి పెద్దలు దొడ్డి వెంకట సత్యనారాయణ (బాబు) మద్దాల కృష్ణారావు, సూరిశెట్టి జగ్గారావు కాండ్రేగుల అప్పారావు ఎల్లపు గోవింద కొణతాల వాసు, శిల్పరిశెట్టి భాస్కరరావు పాల్గొన్నారు.

వృద్ధ మహిళలను సత్కరిస్తున్న దృశ్యం

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రథమ, ద్వితీయ బహుమతులు అందుకుంటున్న కొక్కిరాపల్లి ఎపిడబ్ల్యుఆర్ఎస్, తానాం ఎంజెపిఎపి బిసి పాఠశాలల విద్యార్థులు

ప్రజాశక్తి- అనకాపల్లి

స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. భరతనాట్యాలు, యోగ విన్యాసాలు, దేశభక్తి పెంపొందించే డాన్సులు అలరించాయి. వీటిలో కొక్కిరాపల్లి మండలం ఏపీడబ్ల్యూఆర్ఎస్ విద్యార్థుల ప్రదర్శనకు ప్రథమ స్థానం, తానాం ఎంజెపిఏపీ బీసీ విద్యార్థుల ప్రదర్శనకు రెండవ స్థానం, కసింకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రదర్శనకు మూడవ స్థానం లభించాయి. వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్ కూడా ఆకట్టుకున్నాయి. వీటిని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, ఎంపీ సీఎం రమేష్, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్పీ దీపిక, జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, పలువురు అధికారులు సందర్శించారు.

తృతీయ బహుమతి అందుకుంటున్న కశింకోట స్కూల్ విద్యార్థులు

సాంస్కృతిక ప్రదర్శనలు ఇస్తున్న విద్యార్థులు

యోగా విన్యాసాలు చేస్తున్న విద్యార్థులు

యుద్ధ సన్నివేశాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

టెన్త్‌లో ప్రతిభావంతులకు పురస్కారాలు

ప్రజాశక్తి-వడ్డాది

బుచ్చయ్యపేట మండలం, వడ్డాది జెడ్పీ హైస్కూల్లో 2023-24లో టెన్త్ పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రతిభావంతులకు పూర్వ విద్యార్థులు గురువారం నగదు పురస్కారాలు అందజేశారు. 1991-92 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ప్రతి ఏటా మెరిట్ స్టూడెంట్స్‌కి నగదు పురస్కారాలను అందిస్తున్నారు. ఈ ఏడాది 500పైన మార్కులు సాధించిన ఎనిమిది మందికి రూ.1000, రూ.500 చొప్పున నగదుతో పాటు ప్రశంసా పత్రాలు అందించారు. వచ్చే ఏడాది మరింత ఎక్కువ మంది పురస్కారాలను అందుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటరావు, పూర్వ విద్యార్థులు ఆది పోలిబాబు, దొండా వరహాల బాబు, రవి, నాగేష్, కృష్ణంరాజు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వెంకటరమణ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-పరవాడ

అనకాపల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ జన్మదిన వేడుకలు గురువారం తాణాం గ్రామంలో అతని స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. కన్నూరు వెంకటరమణ సర్పంచి కన్నూరు దేవి దంపతులను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంత్రి జగన్నాధరావు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని పెందుర్తి ఎమ్మెల్యే సోదరుడు ప్రసాద్ ప్రారంభించారు. యువకులు అనేకమంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి, మాజీ జెడ్పిటిసి పైలా జగన్నాధరావు, పరవాడ సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు, తాణాం మాజీ సర్పంచ్ పైల రామారావు, నాయకులు రెడ్డి శ్రీనివాసరావు, పైల రామచంద్రరావు, బుగుడి రామ గోవిందరావు, కన్నూరు యువసేన సభ్యులు పాల్గొన్నారు.

పలువురికి సత్కారాలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

అచ్యుతాపురం పంచాయతీలో పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లను గురువారం పంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామ సర్పంచ్ కె విమల నాయుడు ద్వారపురెడ్డి బాబ్జి చేతుల మీదుగా సన్మానించారు. ఈ సందర్భంగా దుప్పట్లు అందజేశారు. ఉప్పవరం పంచాయతీలో మాజీ సైనికులకు గ్రామ సర్పంచ్ సకల ఉమామహేశ్వరి, ఉప సర్పంచ్ కూని శెట్టి సత్తిబాబు సన్మానం చేశారు. మల్లవరం గ్రామంలో గ్రామ సర్పంచ్ పి.వాసు రాజు చేతులమీదుగా పలువురుని సన్మానం చేశారు. తిమ్మరాజుపేటలో తమ పిల్లలను నిత్యం పాఠశాలకు పంపిన తల్లిదండ్రులను గ్రామ సర్పంచ్ ఎస్ భాగ్యలక్ష్మీ బాపినాయుడు తదితరులు సత్కరించారు.

స్వచ్ఛత లేని బంగారం అమ్మకాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

'శ్రావణ మాసం' ముసుగులో జిల్లాలో స్వచ్ఛత లేని బంగారం ఆభరణాల అమ్మకాలు జరుగుతున్నాయని, కొన్ని జ్యూయలరీ షాపులు ప్రకటించే రాయితీలు, లక్కీ డ్రా కూపన్‌ల వంటి ఆకర్షణీయ ప్రకటనల పట్ల వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ సూచించారు. స్థానిక గౌరీ గ్రంథాలయంలో కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్, అనకాపల్లి మండల కన్స్యూమర్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో 'శ్రావణ మాసం- బంగారం అమ్మకాల్లో మోసం'పై గురువారం మహిళా సదస్సు నిర్వహించారు. ఇందులో వెంకటరమణ మాట్లాడుతూ బంగారం స్వచ్ఛతపై భరోసా కోసం హాల్ మార్కింగ్ ఆభరణాలే కొనుగోలు చేయాలని, తిరిగి అమ్మేటపుడు కూడా అంతే విలువ పొందవచ్చని చెప్పారు. వినియోగదారులు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని, బిల్లులో బంగారం స్వచ్ఛత, ధర, తూకం ఉండాలన్నారు. వినియోగదారుల బలహీనతలను ఆసరగా తీసుకుని తరుగు, మేకింగ్ ఛార్జీలు పేరుతో వినియోగదారులను మోసగిస్తున్న జ్యూయలరీ షాపుల పట్ల వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొంతమంది బంగారు వ్యాపారులు కేడీఎం (కాడ్మియా) స్వచ్ఛతకు గుర్తింపుగా ప్రచారం చేస్తుంటారని, అది వాస్తవం కాదన్నారు. హాల్ మార్కింగ్ కల్గిన ప్రతి ఆభరణానికీ ప్రత్యేక సార్వత్రిక సంఖ్య (హెచ్‌యుఐడీ) ఉంటుందని, దీని వల్ల ఎక్కడ తయారీ, ఎక్కడ విక్రయించారో కూడా సులభంగా తెలుసుకోవచ్చని చెప్పారు. సదస్సులో గ్రంథాలయం మాజీ కార్యదర్శి మళ్ల బాపునాయుడు, ఉపాధ్యక్షులు కర్రి గంగాధర్, మళ్ల సూరిబాబు, దాడి ఈశ్వరరావు, వృత్తి నైపుణ్య శిక్షకులు రాపేటి ప్రేమలత, మళ్ల మౌనిక, గిలకంశెట్టి నాగమణి పాల్గొన్నారు.

వాడవాడలా స్వాతంత్ర్య దినోత్సవం

బహుమతులు అందిస్తున్న అనకాపల్లి ఎంపీపీ సూరిబాబు

ప్రజాశక్తి- విలేకర్ల యంత్రాంగం

78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని గురువారం జిల్లాలోని వాడవాడలా ఘనంగా నిర్వహించారు. పలు ప్రభుత్వ కార్యాలయాలు, రాజకీయ పార్టీలు, పలు సంస్థల కార్యాలయాల వద్ద జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

అనకాపల్లి : స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపిపి గొర్లి సూరిబాబు జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అనకాపల్లి కోర్టులో జరిగిన వేడుకల్లో జిల్లా జడ్జి శ్రీవిద్య, ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ రమేష్, సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ విజయలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంజెవిఎన్ కుమార్ పాల్గొన్నారు. ఆర్ఎఆర్ఎస్‌లో ఎడిఆర్ డాక్టర్ ముకుందరావు, స్థానిక ఎఎంఎఎల్ కళాశాలలో అనకాపల్లి వర్తకసంఘం అధ్యక్షులు కొణతాల లక్ష్మీనారాయణ, డైట్ కళాశాలలో కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ దేవరశెట్టి వెంకటేశ్వర్లు జాతీయ పతాకాలను ఎగురవేశారు. ప్రజా రాజకీయ వేదిక వ్యవస్థాపకులు కనిశెట్టి సురేష్ బాబు, శేఖర మంత్రి సాయి లక్ష్మణ్, చినరామ యువజన సంఘం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో బొడ్డేడ మురళి పాల్గొన్నారు. తుమ్మపాల, మార్టూరు, బౌల్వాడ, దిబ్బపాలెం, ఊడేరు తదితర గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచులు జాతీయ పతాకాలను ఆవిష్కరణ చేశారు. జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, టిడిపి పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు, టిడిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే గోవింద సత్యనారాయణ జెండాలను ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు పాల్గొన్నారు. వైసిపి కార్యాలయంలో మాజీ ఎంపీ బివి సత్యవతి, దిలీప్ కుమార్, మందపాటి జానీ, పెద్ది శెట్టి గోవిందు పాల్గొన్నారు.

చోడవరం : చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, వైసిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, చోడవరం చక్కర కర్మాగారం వద్ద ఎమ్‌డి వి.సన్యాసినాయుడు, చోడవరం కోర్టు వద్ద న్యాయమూర్తి రత్న కుమార్, మండల రెవెన్యూ కార్యాలయం వద్ద తహశీల్దారు తిరుమల బాబు, విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద ఏడి యూకే గౌరీ ప్రసాద్, వాకర్స్ క్లబ్ వద్ద అధ్యక్షులు ఓరుగంటి రాంబాబు జాతీయ జెండాలను ఎగురవేశారు.

కె.కోటపాడు : స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద సబ్ రిజిస్ట్రార్ బంగారు వెంకటేశ్వరరావు, ఎమ్మార్వో కార్యాలయం వద్ద తహశీల్దార్ రమేష్ బాబు, పోలీస్ స్టేషన్, అయ్యన్న పాఠశాలల వద్ద సిఐ స్వామినాయుడు, లంకవానిపాలెంలో సర్పంచ్ వేచలపు దొరబాబు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. మండలంలోని పలు పాఠశాలల వద్ద ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జెండాలను ఎగరవేశారు. ఆటల్లో ప్రతిభ చూపించిన పలువురు విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

పరవాడ : ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు, పరవాడ పోలీస్ స్టేషన్లో సిఐ బాల సూర్యరావు, రెవెన్యూ కార్యాలయం వద్ద డిప్యూటీ తహశీల్దారు శాంతి భూషణరావు జాతీయ జెండాలను ఎగురవేశారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓ కీర్తి స్పందన, పరవాడ ఉప సర్పంచ్ బండారు రామారావు, ఎంఈఓ దివాకర్, ఏవో రాంబాబు, పలువురు నాయకులు పాల్గొన్నారు. మండలంలోని సంస్కృతి గ్లోబల్ స్కూల్‌లో జెండాను ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి ఆవిష్కరించారు. విద్యార్థులు జాతీయ నాయకులు వేషధారణతో ఆకట్టుకున్నారు. వారిని సీఈఓ కె.నిశాంత్ అభినందించారు.

బుచ్చయ్యపేట : ఎంపీడీఓ కార్యాలయం లో ఎంపీడీఓ వెంకటాచార్య, మండలంలోని దిబ్బిడి హైస్కూల్లో ప్రధానోపాధ్యాయులు సత్యారావు జెండాల ఆవిష్కరణ చేశారు.

జెండాకు సెల్యూట్ చేస్తున్న లంకవానిపాలెం సర్పంచ్ వేచలపు దొరబాబు

వడ్డాది : వడ్డాది పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కోరుకొండ కామ లక్ష్మి, హైస్కూల్లో హెచ్‌ఎం వెంకట్రావు, జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ అన్నపూర్ణ, ప్రభుత్వాసుపత్రిలో వైద్యాధికారి మౌనిక, కెజిబివిలో అన్నపూర్ణ, బుచ్చయ్యపేట ఆర్డిఎస్ఎస్ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి గాడి శ్రీను పతాకావిష్కరణ చేశారు. క్రీడా పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఉబహుమతుల ప్రదానం చేశారు.

దేవరాపల్లి : స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, జెడ్పిటిసి కర్రి సత్యం, ఎంపీడీవో ఎస్.అప్పలరాజు, పిహెచ్‌సి వద్ద వైద్యాధికారి పూజ్య మేఘన, రెవెన్యూ కార్యాలయం వద్ద తహశీల్దార్ ఎం.లక్ష్మి, పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐ జమ్ములు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఇఒ బి.పడాల్ దాస్, తెనుగపూడి గురుకుల బాలుర కళాశాలలో ప్రిన్సిపాల్ డి.జయ ప్రకాష్, బేతపూడి కేజీబీవీలో ప్రత్యేక అధికారి సిహెచ్ భువన మాధురి, దేవరాపల్లి సచివాలయం -1 వద్ద సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపిటిసి మొల్లి కృష్ణమూర్తి, మాజీ ఎంపిపి కిలపర్తి భాస్కరరావు, వేచలం పిహెచ్‌సిలో వైద్యాధికారి బి.హారిక, స్థానిక కైరళి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో కరెస్పాండెంట్ దినేష్, కాశీపురం జనసేన మండల కార్యాలయం గొర్రెపోటు రామ్మూర్తి జెండాలను ఆవిష్కరించారు.

కశింకోట : కశింకోట పోలీస్ స్టేషన్‌లో సిఐ వినోద్ బాబు, పంచాయతీ వద్ద సర్పంచ్ జయ రజిని, డిపిఎన్ హైస్కూల్‌లో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఆచంటి రవి, పిడి ప్రభాకర్ రావు, సెయింట్ జాన్స్ పాఠశాలలో కెనాన్ జాన్, డైరక్టర్ నోబెల్ కుమార్, కర్సపాండెంట్ అనురాధ, ఉగ్గిని పాలెం పంచాయతీ వద్ద ఎంపీపీ కలగా లక్ష్మి, సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు, కలగా సోమేశ్వరరావు, గాయత్రి హైస్కూల్‌లో కరస్పాండెంట్ కుమార్ స్వాతంత్ర్య వేడుకల్లో జెండాలను ఆవిష్కరించారు.

సబ్బవరం : స్థానిక పోలీస్ స్టేషన్లో సీఐ పిన్నింటి రమణ, రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దారు వెంకట్, మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీడీవో ఎస్ రామ్మోహన్‌రావు, గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ ఎన్.రామకృష్ణ, సబ్బవరం పంచాయతీ వద్ద సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, అంతకాపల్లి సచివాలయం వద్ద సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రిన్సిపాల్ పి.మురళీధర్ జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

అచ్యుతాపురం : స్థానిక తహసీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల వద్ద పతాకావిష్కరణ కార్యక్రమంలో ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ పాల్గొని జాతీయ జెండాకు గౌరవ వందనం చేశారు. కార్యక్రమంలో ఎంపిపి కోన సంధ్య ఎంపీడీవో సురేష్ కుమార్, జడ్పిటిసి సభ్యుడు లాలం రాంబాబు, జనసేన, టిడిపి నాయకులు బి రామదాసు, జనపరెడ్డి నర్సింగరావు పాల్గొన్నారు. సర్కిల్ పోలీస్ స్టేషన్‌లో సిఐ ఎం బుచ్చిరాజు, గ్రంథాలయంలో లైబ్రేరియన్ దొడ్డి కోటేశ్వరరావు జెండాలను ఆవిష్కరించారు.

మునగపాక : వైసిపి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ తన క్యాంపు కార్యాలయంలో, పిఎసిఎస్ కార్యాలయం వద్ద విశ్రాంత సీఈఓ పెంటకోట వెంకటరావు, పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ దిమ్మల అప్పారావు, వాడ్రాపల్లి గ్రంథాలయం వద్ద మందిర అధ్యక్షులు పెతకంశెట్టి రామజోగినాయుడు జాతీయ జెండాలను ఎగురవేశారు. స్థానిక తహసీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్లలో త్రివర్ణ పతాకాలు రెపరెపలాయాయి.

యలమంచిలి : స్థానిక మున్సిపాల్టీలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ జెండా ఆవిష్కరణ చేశారు. మున్సిపల్ అధికారులు, జనసేన నేతలు బొద్దపు శ్రీనివాస్, కొఠారు నరేశ్ పాల్గొన్నారు. అయితే ఈ వేడుకలకు మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు ఎవరూ హాజరుకాలేదు. టిడిపి కార్యాలయంలో నియోజకవర్గం ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు జెండా ఎగురవేశారు. నాయకులు ధూళి రంగనాయకులు, జిల్లా ఉపాధ్యక్షులు కొలకులూరి విజయబాబు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి బోదెపు గోవిందరావు జాతీయ పతాకం ఆవిష్కరించారు. బయ్యవరం ఎంపిటిసి గణేశ్, ఎంపిడిఒ అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఎన్‌టిపిసి సింహాద్రిలో...

పరవాడ : 78వ స్వాతంత్ర్య వేడుకలు ఎన్టిపిసి సింహాద్రి సదన క్రీడా మైదానంలో గురువారం ఘనంగా నిర్వహించారు. హెచ్ఒపి సంజయ్ కుమార్ సిన్హా జాతీయ జెండాను ఎగురవేశారు. సిఐఎస్ఎఫ్ బలగాలు ప్రదర్శించిన రిథమిక్ ప్లాటూన్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉదయం అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్‌లో టెక్నికల్ సర్వీసెస్ ఎస్ పద్మప్రియ, ప్లాంట్ వద్ద ఉన్న సంకల్ప్ భవన్‌లో ఎస్‌జె డేవిడ్ (జీఎం, ఓ అండ్ ఎం) జెండాను ఎగురవేసి ప్రజల నుద్దేశించి ప్రసంగించారు.

జెండాకు సెల్యూట్ చేస్తున్న ఎన్‌టిపిసి హెచ్ఒపి సిన్హా

కెనరా విద్యా జ్యోతి పథకం ద్వారా మెరిట్ స్కాలర్ షిప్‌లు పంపిణీ

ప్రజాశక్తి-పరవాడ

కెనరా బ్యాంకు ప్రవేశ పెట్టిన విద్యా జ్యోతి పథకం ద్వారా పరవాడ కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో మేనేజర్ రమేష్ గురువారం తాణాం జిల్లా పరిషత్ పాఠశాలలో 5, 6, 7 తరగతుల విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.3వేలు చొప్పున మెరిట్ స్కాలర్ షిప్‌లు అందజేశారు. 10వ తరగతి విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున మొత్తం రూ.24 వేలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

అచ్యుతాపురం : కెనరా బ్యాంకు విద్య జ్యతి పథకంలో భాగంగా అచ్చుతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతూ ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆరుగురు విద్యార్థులకు బ్రాంచ్ మేనేజర్ రాకేష్‌బాబు చేతుల మీదుగా ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంక్ ఆఫీసర్ దినేష్ బొడ్డేడ శ్రీనివాసరావు హైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కనీస సౌకర్యాల కల్పనలో నిర్లక్ష్యంపై ...

గిరిజనుల వినూత్న నిరసన

ప్రజాశక్తి-మాడుగుల:స్వాతంత్ర్యం వచ్చి ఏళ్లు గడుస్తున్నా కనీస సౌకర్యాలు కానరాలేదని మండలంలోని తాటిపర్తి పంచాయతీ శివారు అజయ్‌పురం గ్రామంలో గిరిజనులు వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. గురువారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అర్ధనగ్నంగా ఆకులు చుట్టుకొని నెత్తిన అడ్డాకులు టోపీలు పెట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఆదివాసి గిరిజన సంఘం నాన్ షెడ్యూల్ ఏరియా జిల్లా కార్యదర్శి ఇరట నరసింహమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు కార్లి భవాని మాట్లాడుతూ, ఈ మారుమూల గిరిజన గ్రామానికి రోడ్డు, తాగునీరు, విద్యా, వైద్యం వంటి మౌలిక సదుపాయాలు లేవన్నారు. నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలను ఐదోవ షెడ్యూల్లో చేరిస్తేనే నాన్ షెడ్యూల్ ఏరియా గిరిజనులకు స్వాతంత్ర్యం వచ్చినట్టు అవుతుందన్నారు. ఆ దిశగా ప్రభుత్వాలు కృషి చేయాలని డిమాండ్ చేసారు. గిరిజన గ్రామాలలో మౌలిక సదుపాయాలు రోడ్లు, మంచినీరు, కరెంటు, రేషన్ కార్డులు వంటివి అందలేదన్నారు. సబ్సిడీపై ఎటువంటి సౌకర్యాలు అందలేదన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వంటివి ఆమడ దూరంలో ఉన్నారని తెలిపారు. రోడ్లు లేక గ్రామాల్లో నేటికీ డోలి మోతలు తప్పలేదన్నారు. ఇప్పటికైనా గిరిజన గ్రామాలలో లింక్ రోడ్లు సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నాన్ షెడ్యూల్డ్ ఎరియా గిరిజన గ్రామాలపై దృష్టి పెట్టాలని, ప్రత్యేక ఐటిడిఎను ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో వంతాల కేశ్వరావు, మచిరాజు పోతురాజు, రాజులమ్మ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నిరసన చేపడుతున్న గిరిజనులు

కొత్తకోట:స్వాతంత్ర్య సిద్ధించి 78 ఏళ్ళు గడిచినా ఆదివాసీ ల జీవనంలో మార్పు రాలేదని ఏపీ ఆదివాసీ హక్కుల సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షులు యన్ కళ్యాణ్ తెలిపారు. రావికమతం మండలం పి.గధపపాలెంలో గురువారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళ్యాణ్ మాట్లాడుతూ, నాన్ షెడ్యూల్ ఏరియా ని 5వ షెడ్యూల్‌లో చేరిస్తేనే ఆదివాసీలకు స్వాతంత్ర్యం వచ్చినట్లు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రావికమతం సంఘం అధ్యక్షులు ఈ.దేముడు, కళ్యాణ్, నాగు, శ్రీను పాల్గొన్నారు.

రెపరెపలాడిన మువ్వన్నెల జెండా

నర్సీపట్నంలో జెండాను ఎగురవేస్తున్న ఆర్‌డిఒ

ప్రజాశక్తి -నక్కపల్లి:

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు గురువారం పలు చోట్ల ఘనంగా జరిగాయి. వాడవాడలా మువ్వన్నెల జెండా రెపరెపలాడింది.

నక్కపల్లిలో క్రిష్ టౌన్ షిప్‌లో హోం మంత్రి వంగలపూడి అనిత జాతీయ జెండాను ఆమె ఎగురవేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ అంబేద్కర్, మండల పరిషత్ కార్యాలయం వద్ద వైస్ ఎంపీపీ నానాజీ, ప్రభుత్వ పాఠశాలల్లో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జెండాను ఆవిష్కరించారు. నక్కపల్లిలో జనసేన పార్టీ కార్యాలయం వద్ద ఆ పార్టీ నేతలు బోడపాటి శివ దత్, తోట నగేష్, వైసిపి కార్యాలయం వద్ద రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, వైసీపీ నేత వీసం రామకృష్ణ, ఉపమాకలో గాంధీజీ విగ్రహం వద్ద సర్పంచ్ ప్రగడ వీరబాబు, టిడిపి నేత కొప్పిశెట్టి బుజ్జి, నక్కపల్లి గురుకులంలో ప్రిన్సిపల్ సువర్ణ రత్నకుమారి జెండాను ఆవిష్కరించారు. పెదబోదుగలం హైస్కూల్లో పదో తరగతిలో 517 మార్కులు సాధించిన విద్యార్థి రఫీకి జాతీయ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, విశ్రాంతి ఉపాధ్యాయులు సత్యదేవ శర్మ 10 వేలను బహుమతిగా అందజేశారు. ఈ విద్యా సంవత్సరంలో 500 మార్కులు దాటిన ప్రతి విద్యార్థికి 10 వేల నగదు బహుమతి అందజేస్తామని ప్రకటించారు .

మాడుగుల : స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద శాసనసభ్యుడు బండారు సత్యనారాయణమూర్తి జాతీయ జెండాను ఎగురవేసారు. ఈ కార్యక్రమాలలో మాజీ శాసనసభ్యుడు గవిరెడ్డి రామానాయుడు, నాయకులు పాల్గొన్నారు.

మాడుగుల : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ శాస్త్రి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ జి జయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు. మాడుగులలో భారత నిర్మాణ సంస్థ ఏర్పాటు చేసిన రక్త దాన శిబిరంలో విద్యార్థులు 18 మంది పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పైడిరాజు, షర్మిలశ్రీ, బి.రాజు, బి.నారాయణ పాల్గొన్నారు.

మాడుగులలో...

నాతవరం :తమ తమ కార్యాలయాల వద్ద తహసీల్దార్ ఎస్ఎస్‌వి నాయుడు, ఎస్సై రామారావు, ఎంపీపీ సాగిన లక్ష్మణ మూర్తి, ఏఈ చంద్రమౌళి జండా ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జె. రాంబాబు, మండల విద్యాశాఖ అధికారి 2 వరహాలు బాబు, డిప్యూటీ తహసిల్దార్, ఆర్ఐ హరి పాల్గొన్నారు.

నాతవరంలో...

కోటవురట్ల:తహసిల్దార్ జానకమ్మ, ఎంపీపీ అప్పలనాయుడు, స్థానిక ఎస్సై రమణయ్య సబ్ రిజిస్టర్ నరసింహమూర్తిలు జెండాలను ఎగురవేశారు. కోట ఉరట్ల సచివాలయం వద్ద సర్పంచ్ అనిల్ కుమార్, కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు. కైలాస పట్నం గ్రామంలో కోలా రమేష్ ఇంటి వద్ద వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు.

చీడికాడ: డిప్యూటీ తసిల్దార్ రమేష్, ఎస్ఐ నారాయణరావు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు గోవిందు, స్థానిక మోడల్ స్కూల్లో ప్రిన్సిపల్ సిహెచ్ వెంకటలక్ష్మి జాతీయ పతాకాన్ని ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బొంజు బాబు, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు

నర్సీపట్నం టౌన్: సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో హెచ్‌వి.జయరాం జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవిబాబు, కౌన్సిలర్లు, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు. గ్రంథాలయంలో గ్రంథాల యాధికారి దమయంతి ఆధ్వర్యంలో మండల విద్యాశాఖాధికారి జి.నాగేంద్ర జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నర్సీపట్నం బాలోత్సవ కమిటీ కార్యదర్శి కె.త్రిమూర్తులు మాట్లాడుతూ, ఆనాటి స్వాతంత్రోద్యమ నాయకులు ఆశించిన ఫలితాలు ప్రజలందరికీ దక్కకపోవడం విచారకరమన్నారు. నర్సీపట్నం జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర జాతీయ జెండాను ఎగురవేశారు. స్థానిక రవీంద్ర భారతి పాఠశాలలో జరిగిన వేడుకల్లో బాబా తల్లీ పిల్లల ఆసుపత్రి డాక్టర్ కిల్లాడ సత్యనారాయణ మాట్లాడారు. నార్త్ ఆంధ్ర జోనల్ ఇన్‌చార్జ్ ఎన్.వెంకటేష్, ప్రిన్సిపల్ కె.గిరిధర్, ఏజిఎం మూర్తి పాల్గొన్నారు.

ఏబిఎం డిగ్రీ కళాశాలలో వైయస్సార్ ఆసుపత్రి డాక్టర్ పిఎస్‌వి.రాజశేఖర్ పతాకావిష్కరణ చేశారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాస్, ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యుత్ డివిజన్ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విడివి.రామకృష్ణారావుజాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టౌన్, రూరల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఎ.సత్యానందం, పి.సునీల్ కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

5వ షెడ్యూల్ సాధన కమిటీ, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో వేడుకలు

జెండాను ఎగురవేస్తున్న గోవిందరావు, గిరిజనులు

ప్రజాశక్తి -కొత్తకోట:స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను 5 వ షెడ్యూల్ సాధన కమిటీ ఆధ్వర్యంలో చీమలపాడు శివారు కళ్యాణపులోవ, అజయ్ పురం గ్రామాల్లో గురువారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాధన కమిటీ జిల్లా అధ్యక్షులు కే.గోవిందరావు, సభ్యులు మర్రి ప్రసాద్ తదితరులు మాట్లాడుతూ, ఎన్నో ఏళ్ల నుంచి నాన్ షెడ్యూల్ ప్రాంతాలలో ఎనిమిది మండలాలు 263 గ్రామాల్లో 50 వేల మంది జనాభా ఏజెన్సీ ని ఆనుకొని కొండ దిగువ భాగంలో జీవనం సాగిస్తున్నారన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్టును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాంగి సూరిబాబు, ఆదివాసీ గిరిజన మహిళలు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్:ఎస్ఎఫ్ఐ, డివైఎస్ఐ ఆధ్వర్యంలో నర్సీపట్నం బాలుర సంక్షేమ వసతి గృహంలో గురువారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వసతి గృహ అధికారి శ్రీనివాస్ జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రెసిడెంట్ జీ.గీతాకృష్ణ మాట్లాడుతూ, ఎన్నో త్యాగాలు, పోరాటాల ఫలితంగా స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ డివిజన్ ప్రెసిడెంట్ గౌతమ్, ఎస్ఎఫ్ఐ వైస్ ప్రెసిడెంట్ జ్ఞానేశ్, వైస్ సెక్రటరీ బోసన్, డివిజన్ నాయకులు శివ, ప్రసాద్ , కిరణ్, దుర్గా పాల్గొన్నారు.

అనకాపల్లిడెస్క్: ఎస్.రాయవరం మండలంలోని ధర్మవరం జంక్షన్‌లో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య వేడుకలు నిర్వహించారు. విప్లవ వీరులు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్ అప్పలరాజు, ఆటో యూనియన్ సభ్యులు నివాళు లర్పించారు. అనంతరం జాతీయ జెండాను యూనియన్ గౌరవ అధ్యక్షులు ఖండిపల్లి సూరిబాబు ఎగురవేశారు.

ధర్మవరంలో జెండాను ఎగురవేస్తున్న అప్పలరాజు, సభ్యులు

పార్టీ నాయకులతో బొత్స

బొత్సను కలిసిన నేతలు

ప్రజాశక్తి -నక్కపల్లి:ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థి, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను నక్కపల్లిలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, వైసిపి నేత వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిశారు. గురువారం ఆయన విజయవాడ నుంచి వస్తూ నక్కపల్లిలో ఆగారు. వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో బొత్సను సత్కరించారు. పార్టీ శ్రేణులతో ఆయన కొంతసేపు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వీసం రాజు, ఎల్లేటి సత్యనారాయణ, అల్లాడ కొండ, గోవింద్ పాల్గొన్నారు.

చదునుగా ఉన్న రోడ్డు

తొలగించిన స్పీడ్ బ్రేకర్లు

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి -కోటవురట్ల:మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్ల కారణంగా బుధవారం జరిగిన రెవెన్యూ ఉద్యోగి ద్విచక్ర వాహనం ప్రమాదంపై ప్రజాశక్తిలో వచ్చిన వార్తకు అధికారులు స్పందించారు. స్పీడ్ బ్రేకర్లను గురువారం తొలగించారు. నిబంధనలకు విరుద్ధంగా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటూ ఉండటంతో జిల్లా స్థాయి అధికారులు స్పందించి వాటిని తొలగించాలని ఆదేశాల మేరకు తొలగిస్తున్నట్లు మండల పరిషత్ అధికారులు తెలిపారు. దీంతో వాహన చోదకులు ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

సిఐ, ఎస్ఐలకు అవార్డుల ప్రదానం

ప్రజాశక్తి -కొత్తకోట:కొత్తకోట సర్కిల్ సీఐ అప్పలనాయుడు ఉత్తమ సీఐ అవార్డును అందుకున్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురష్కరించుకొని అనకాపల్లి జిల్లా కేంద్రంలో గురువారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర హోం మంత్రి అనిత, ఎంపీ సీఎం రమేష్, జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్, ఎస్పీ దీపిక చేతుల మీదుగా అవార్డుతో పాటు ప్రశంసాపత్రం అందుకున్నారు. అవార్డుకు ఎంపిక కావడం ఎస్ఐలు లక్ష్మణరావు, ధనుంజయనాయుడు, ఈశ్వరరావు, సురేష్‌లు అభినందించారు.

అవార్డు అందుకుంటున్న కొత్తకోట సిఐ

చీడికాడ:చీడికాడ మండలం ఖండివరం గ్రామంలో పశు వైద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్న సిహెచ్ గణేష్ ఉత్తమ అవార్డును అందుకున్నారు.

గొలుగొండ:మండలంలోని కృష్ణదేవిపేట ఎస్సై ఎం.ఉపేంద్ర అనకాపల్లిలో రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఎస్సైకు శుభాకాంక్షలు తెలియజేశారు.

జిల్లా ఉత్తమ లైన్‌మేన్‌గా నాగులాపల్లి దేవార్జున అవార్డును ఎస్ఈ చేతుల మీదుగా అందుకున్నారు.

అవార్డు అందుకుంటున్న లైన్‌మ్యాన్

వి.సెజ్‌లో స్వాతంత్ర్య దినోత్సవం

వి సెజ్‌లో పతాకాన్ని ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్

ప్రజాశక్తి - ఉక్కునగరం : వి. సెజ్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. జోనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ శ్రీనివాస్ ముప్పాల జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తుచేశారు. వారి బాటలో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. వి సెజ్ పురోగతిని వివరించారు. అధికారులు, సిబ్బంది కృషిని ప్రశంసించారు. కార్యక్ర చాశ్రీశ్రీబతీఌమంలో సెజ్ జాయింట్ డెవలప్‌మెంట్ కమిషనర్ రోష్ని అపరంజి కొరాటి, ఉన్నతాధికారులు ప్రవీణ్ కుమార్, వర ప్రసాద్ వర్మ పాల్గొన్నారు.

సినర్జీస్ క్యాస్టింగ్ లిమిటెడ్‌లో...

ఉక్కునగరం : దువ్వాడ విఎస్ఇజడ్‌లోని సినర్జీస్ క్యాస్టింగ్స్ లిమిటెడ్ కంపెనీలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. చీఫ్ ఫైనాన్స్ అధికారి జయరాం జెండా ఎగురవేశారు. ఈ సంధర్ధంగా ఆయన వ మా ట్లా డు తూ, స్వాతంత్ర్యం తర్వాత మన దేశం అన్ని రంగాల్లో ముఖ్యంగా పారిశ్రామిక రంగంలో ఎంతో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ బిఎన్ఎన్.రాజు, డిప్యూటీ జనరల్ మేనేజర్ (ప్రాజెక్టు) జెఆర్.ప్రసాద్, ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

సినర్జీస్‌లో...

ప్రజాశక్తిలో జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి - గాజువాక : ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రముఖ సుగర్ వ్యాధి నిపుణులు ఎం.రమేష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకులతీరుతో దేశంలో పేద, ధనిక అంతరాలు పెరుగుతున్నాయన్నారు. ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారం చేపట్టాక ప్రభుత్వ రంగానికి వాటిల్లిన ముప్పునూ, దేశంలో రాజుకుంటున్న మత విద్వేషాలను తెలియజేశారు. ఆర్‌కె.నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి జిల్లా సమన్వయ కమిటీ సభ్యులు వై.సత్యనారాయణ, కె.అప్పలనాయుడు, ఎస్. రాజేశ్వరరెడ్డి, విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ రమేష్‌కుమార్

మొక్కలతోనే మానవుని మనుగడ

ప్రజాశక్తి- అరకులోయ: మొక్కలు నాటడం ద్వారానే మానవాళి మనుగడ ఆధారపడి ఉందని పెదలబుడు మేజర్ పంచాయతీ సర్పంచ్ పెట్టేలి దాసుబాబు, పంచాయతీ ఈవో రాజ్ కుమార్ అన్నారు. పర్యాటక కేంద్రమైన అరకులోయ టౌన్షిప్ లోని రహదారిలో గల డివైడర్లలో మొక్కలు నాటి కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మన్య ప్రాంతంలో అడవులు అంతరించి పోవడంతో వాతావరణంలో పెను మార్పులు సంభవించాయని అన్నారు. ఇందుకు ప్రధాన కారణం పచ్చదనం తగ్గిపోవడమేనని తెలిపారు.

ప్రభుత్వ రంగ సంస్థల్లో స్వాతంత్ర్య వేడుకలు

స్టీల్‌ప్లాంట్‌లో గౌరవవందనం స్వీకరిస్తున్న సిఎమ్‌డి అతుల్‌భట్

విశాఖలోని ప్రభుత్వ రంగ సంస్థల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. సంస్థల ప్రగతిని ఈ సందర్భంగా వెల్లడించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉద్యోగ విధుల్లో ప్రతిభ కనబరిచిన వారికి అతిథులు ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఎంవిపి.కాలనీ : డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (డిసిఐఎల్) కార్పొరేట్ కార్యాలయంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అండ్ సిఇఒ దుర్గేష్ కుమార్ దూబె జాతీయ జెండాను ఎగరవేశారు. కార్యక్రమంలో కెప్టెన్ ఎస్.దివాకర్, సిజిఎం ఇ.కిరణ్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

విశాఖ పోర్టులో..

విశాఖపట్నం పోర్టు అథారిటీ ఆధ్వర్యంలో పోర్టు స్టేడియం వేదికగా వేడుకలు జరిగాయి. పోర్టు చైర్‌పర్సన్ డాక్టర్ ఎం.అంగముత్తు జాతీయ జెండాను ఎగురవేశారు. పోర్టు సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ విభాగం ఆయనకు గౌరవవందనాన్ని అందజేసింది.

తూర్పు నావికాదళంలో...

స్వాతంత్ర్య వేడుకలను తూర్పు నౌకాదళ కమాండ్‌లో ఘనంగా నిర్వహించారు. వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ జెండా ఎగురవేశారు. నేవీ డ్రిల్ అబ్బురపరిచింది.

నేవీలో గౌరవవందనం స్వీకరిస్తున్న రాజేష్ పెంధార్కర్

వాల్తేరు రైల్వే డివిజన్‌లో...

ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేరు డివిజన్ ఆధ్వర్యంలో తాటిచెట్లపాలెంలోని రైల్వే ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో వేడుకలు జరిగాయి. డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ జాతీయ జెండాను ఎగురవేశారు. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, సివిల్ డిఫెన్స్ సిబ్బంది గౌరవ వందనం స్వీకరించారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో

ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ తృష్ణా మైదానంలో సిఎమ్‌డి అతుల్ భట్ జాతీయ జెండాను ఎగురవేశారు. సిఐఎస్ఎఫ్ జవాన్ల గౌరవ వందనం స్వీకరించారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, సిఐఎస్ఎఫ్ సభ్యులు, హోంగార్డులు, సరఫరాదారులు, కస్టమర్లు, భాగస్వాములకు సిఎమ్‌డి స్వాతంత్ర్య దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆర్ఐఎన్ఎల్ లాభాల బాట పట్టేందుకు ప్రతి ఉద్యోగీ విలువ సృష్టికర్తగా మారాలని పిలుపునిచ్చారు. ప్రపంచ ఉక్కు అంచనాల ప్రకారం ఈ సంవత్సరం డిమాండ్ 1.7 శాతం పుంజుకుని 1,793 మిలియన్ టన్నులకు చేరుకుంటుందన్నారు. స్టీల్ డిమాండ్ 2025లో 1.2 శాతం వృద్ధి చెంది 1,815 మిలియన్ టన్నులకు చేరుకుంటుందని అంచనా ఉన్నట్లుగా అతుల్ భట్ తెలియ చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సంబంధించి 'అందుబాటులో ఉన్న వనరులలో రాబడిని పెంచడానికి, ఉత్పత్తిలో పెరుగుదల, ఖర్చులు తగ్గించడం, ఆర్థిక రాబడిలో మెరుగుదల అన్న 3-కోణాల విధానాన్ని అవలంబించాలి' అని పిలుపునిచ్చారు. ప్లాంట్‌ను లాభదాయక స్థితికి తీసుకురావడానికి అతుల్ భట్, డైరెక్టర్లు, ఉద్యోగులందరూ 'సంకల్ప్ యాత్ర' (ప్రతిజ్ఞ) తీసుకున్నారు. అనంతరం సిఐఎస్ఎఫ్‌కు చెందిన ఫైర్‌ఫైటింగ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, రైఫిల్ రిఫ్లెక్స్ షూటింగ్, అగ్నిమాపక బృందం కలర్ జెట్ టీమ్‌ల ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి.

పోర్టులో మాట్లాడుతున్న చైర్మన్ అంగముత్తు

భెల్ విశాఖ యూనిట్‌లో

గాజువాక : భెల్ విశాఖ యూనిట్‌లో జాతీయ జెండాను భెల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జితేందర్‌రెడ్డి ఎగురవేశారు. అనంతరం జవాన్ల గౌరవవందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కంపెనీ ఉజ్వల భవిష్యత్తు కోసం అందరూ నిరంతరమూ శ్రమించాలన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మన యూనిట్ రికార్డ్ ఉత్పత్తి రూ.327 కోట్ల టర్నోవర్ సాధించి, లాభదాయక సంస్థగా మార్పుచెందిందని తెలిపారు. ప్రస్తుత సంవత్సరం ప్రతిష్టాత్మక మిషన్ రూ.600 కోట్ల వర్క్ ఆర్డర్ల లక్ష్యాన్ని నిర్ధారించుకున్నామని, అందరి సహకారం, అంకితభావంతో తప్పక సాధించుకోగలమని ఆశాభావం వ్యక్తంచేశారు. యూనిట్‌ను రాబోయే మూడేళ్లలో రూ.1000 కోట్ల వర్క్ ఆర్డర్ల కంపెనీగా రూపొందించుకోగలమన్నారు.

రైల్వే పతాకావిష్కరణలో డిఆర్ఎం సౌరభ్ ప్రసాద్

సీతమ్మధార : ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కార్పొరేట్ కార్యాలయ ఆవరణలో సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొత్త వ్యవసాయ కనెక్షన్ల నమోదు సమయంలో రైతులు దళారీల చేతుల్లో మోసపోకుండా, ఏ కార్యాలయానికి తిరగకుండా రైతు కేవలం తన ఫోన్ నుంచి నేరుగా ఏపీఈపీడీసీఎల్ కాల్ సెంటర్ నంబర్ 1912 కు ఫోన్ చేసి కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌ను పొందే నూతన రిజిస్ట్రేషన్ ప్రక్రియ విధానాన్ని ప్రారంభించామన్నారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన 93 మంది ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఫైనాన్స్ డి.చంద్రం, సంస్థ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ఎవిఎల్.ప్రసన్నకుమార్, సిజిఎంలు పాల్గొన్నారు.

భెల్‌లో మాట్లాడుతున్న ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జితేందర్‌రెడ్డి

పారిశుధ్య సిబ్బందికి సరుకుల పంపిణీ

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని గుండుపాల గ్రామ పంచాయతీ సర్పంచ్ జగురాజు రామకృష్ణ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం పారిశుధ్య సిబ్బందికి నిత్యావసరాలు అందజేశారు. మాజీ ఎంపిటిసి రవివర్మ, డాక్టర్ రమణారావులు నగదును అందజేశారు.

సరుకులు ఇస్తున్న సర్పంచ్

శ్మశానవాటికకు రక్షణ గోడ నిర్మించాలి

-ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలదేవ్

ప్రజాశక్తి-అరకులోయరూరల్: మండల కేంద్రంలోని శరభగూడ శ్మశానవాటికకు రక్షణ గోడను వెంటనే నిర్మించాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్ కోరారు. గురువారం ఆదివాసి గిరిజన సంఘం, సరభగుడ యూత్ బృందం శ్మశాన వాటిక పరిసర ప్రాంతాల్లో పర్యటించి పరిశీలించారు. అనంతరం ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్, మండల నాయకులు కె జగన్నాథం, కొర్ర మగ్గన్న మాట్లాడుతూ, ఏరియా ఏరియా ఆసుపత్రికి ఆనుకొని ఉన్న శరభగుడ, తాంగులగుడ, కంఠబంసుగుడ, నిశానిగుడ, శరభగుడ హౌసింగ్ కోలనీ గ్రామాల శ్మశానవాటికలో రక్షణ ప్రహరీ గోడ నిర్మాణానికి జతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 15 లక్షలు నిధులు మంజూరు అయ్యాయని వాటిని ప్రభుత్వ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు శరభగుడ గ్రామంలో గ్రామసభ ఏర్పాటు చేసి వెంటనే పనులు ప్రారంభిస్తామని చెప్పి నెలలు గడుస్తున్నా ఇప్పటికీ కనీసం పనులు ప్రారంబించలేదని మండి పడ్డారు. ఈ శ్మశానవాటికకు రక్షణ ప్రహరీ గోడ లేనందున భూమి కబ్జాకు గురవుతుందని అన్నారు. ప్రహరీ గోడ లేక చుట్టు ప్రక్కల ఉన్న శరభగుడ, జడ్పీ కాలనీ, సరభగుడ హౌసింగ్ కాలనీ,ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్యం కోసం వస్తున్న రోగులు రాత్రి పూట భయాందోళనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఏరియా ఆసుపత్రికి ఆనుకుని ఉండటం అనంతగిరి, అరకువేలి డుంబ్రిగూడ, మండలాలకు చెందిన పోస్టుమార్టం మృతం దేహాలను ఈ శ్మశాన వాటికలోనే అంతక్రియలు నిర్వహిస్తున్నారని తక్షణమే ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు ,స్థానిక ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకొని రక్షణ ప్రహరీ గోడ నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం పంచాయితీ నాయకులు కె.సహదేవ్, కె.ఆనంద్, బురిడీ అర్జున్, శరభగూడ యూత్ బురిడీ రాజు, పాంగి చంద్రశేఖర్, బోయి ధర్మ,రాంబాబు పాల్గొన్నారు.